ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



రూ.కోట్ల భూమి నిరుపయోగం

నంద్యాల పట్టణంలోని కోట్ల రూపాయల విలువచేసే ప్రభుత్వ భూములు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. జిల్లా కేంద్రం కావడంతో నంద్యాలలో అనేక ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అయినా రెవెన్యూ అధికారులు కార్యాలయ భవనాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలు లేవని అంటున్నారు. దీంతో ఉన్న ప్రభుత్వం స్థలాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఇవి కబ్జా కోరల్లో చిక్కుకునే ప్రమాదం ఉంది. కలెక్టర్ ఈ భూములను కాపాడాలని, అవసరమైన ప్రభుత్వ కార్యాలయ నిర్మాణానికి కేటాయిస్తే మంచిదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

- పశువుల సంతకే పరిమితమైన నూనెపల్లె మార్కెట్‌యార్డు స్థలం
- అడవిని తలపిస్తున్న మత్స్యశాఖకు కేటాయించిన 30 ఎకరాలు
- నిర్లక్ష్యం చేస్తే కబ్జాలపాలయ్యే ప్రమాదం



అరణ్యంగా మారిన మత్స్యశాఖకు కేటాయించిన భూమి

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున 8.5 ఎకరాల నూనెపల్లె మార్కెట్ యార్డు స్థలం విలువ నేడు సుమారు రూ.300 కోట్లకు పైనే ఉంటుంది. మార్కెట్ యార్డుకు ఓవర్ బ్రిడ్జి వైపు నుంచి భారీ వాహనాలు వెళ్లడం కష్టమని, అక్కడ ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం సాధ్యం కాదని రెవెన్యూ, మార్కెటింగ్‌శాఖ అధికారులు కలెక్టర్‌కు నివేదికలు ఇస్తున్నారు. కానీ అక్కడి గోదాముల్లో ఉన్న పశువులను తరలించడానికి మాత్రం భారీ వాహనాలు వెళ్లగలుగుతున్నాయి. ఈ సంగతి మార్కెటింగ్‌శాఖ అధికారులు విస్మరిస్తున్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు సరైన నివేదికలు ఇవ్వడం లేదు. దీని వల్ల ఎనిమిదిన్నర ఎకరాల ప్రభుత్వ భూమికి దారి లేదని సాకు చూపి పశువుల సంతకే పరిమితం చేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆర్‌ఎఫ్ రోడ్ నుంచి మార్కెట్ యార్డుకు గతంలో రహదారి ఉన్నది. అక్కడే పౌరసరఫరాల గోదాము ఉండింది. ఆ గేటు ద్వారానే లారీల రాకపోకలు సాగేవి. ఈ వాస్తవాలను అధికారులు దాచి పెడుతున్నారు. కలెక్టర్ దృష్టికి ఈ విషయాలు తీసుకెళ్లడం లేదు. దీని వెనుక ఉన్న మర్మం ఏమిటో మార్కెటింగ్‌శాఖ అధికారులకే తెలియాలి. ఆ స్థలంలో కలెక్టర్ కార్యాలయ సముదాయాన్ని నిర్మించాలని గత ప్రభుత్వం పరిశీలించింది. కేవలం ఓవర్ బ్రిడ్జి వల్ల ఆ స్థలం అనుకూలంగా లేదని నివేదించినట్లు తెలుస్తోంది. కాని ఆర్‌ఎఫ్ రోడ్ నుంచి కూడా గోదాములోకి చేరుకోవచ్చని మాత్రం నివేదించకపోవడం విడ్డూరం. పశువుల సంత సాకు చూపుతూ నిరుపయోగంగా ఉన్న గోదాములతో అనధికారికంగా కొందరు సిబ్బంది, స్థానిక నాయకుల వ్యాపారాలు ఎక్కడ దెబ్బతింటాయోనని ఆలోచించి తప్పుదారి పట్టించినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ గోదామును సందర్శించి కోట్ల రూపాయల స్థలం నిరుపయోగం కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.


నిరుపయోగంగా మారిన నూనెపల్లె మార్కెట్ యార్డు స్థలం.

నూతన భవనాల నిర్మాణానికి అనుమతి లేదు



నూనెపల్లె మార్కెట్‌యార్డులో నూతన భవనాలను కట్టడానికి గత నాలుగేళ్లగా అనుమతి లేదు. ప్రభుత్వం కూడా కోరలేదు. దీంతో ఎలాంటి ఎస్టిమేట్‌లు వేయలేదు. రోడ్డు సమస్య కూడా ఉంది. గతంలో పౌరసరఫరాల గోదాము ఉన్నప్పుడు అక్కడ ప్రహరీని పగులగొట్టి రహదారి ఏర్పాటు చేశారు. ఆ తర్వాత మళ్లీ మూసివేశారు. మమ్మల్ని యార్డు స్థలం గురించి ఎవ్వరూ అడగలేదు. ఎలాంటి ప్రతిపాదనలు లేవు.

- కల్పన, డిప్యూటీ డైరెక్టర్, మార్కెటింగ్‌శాఖ, నంద్యాల

స్థలం సర్వే చేయిస్తున్నాం



నంద్యాల మత్స్యశాఖకు సర్వేనం.2337, 2338లో 30 ఎకరాలు కేటాయించారు. చాలా యేళ్ల నుంచి ఆ స్థలాన్ని వాడడం లేదు. అందులోని భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇటీవలే రెవెన్యూ అధికారులను సర్వే కోసం దరఖాస్తు చేశాం. జంగిల్ క్లియరెన్స్ చేసి సర్వే చేపడతాం. అలాగే అక్కడ చేపల ఉత్పత్తి పెంచడానికి తగు చర్యలు తీసుకుంటా.

- ఏవీ రాఘవరెడ్డి, జాయింట్ డైరెక్టర్, మత్స్యశాఖ, నంద్యాల

అడవిలా మారిన మత్స్యశాఖ భూమి

నంద్యాల పట్టణానికి కేవలం ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో మహానంది రోడ్‌లో 50యేళ్ల క్రితం 30 ఎకరాల భూమిని మత్స్యశాఖకు కేటాయించారు. ప్రస్తుతం ఆ భూమికి కూడా రెక్కలు వచ్చాయి. లక్షల రూపాయల ఆ భూమూలు నేడు కోట్ల రూపాయాలకు చేరుకున్నాయి. మత్స్యశాఖ కేవలం మూడు నుంచి ఐదు ఎకరాల్లో మాత్రమే చేపపిల్లల ఉత్పత్తి, పెంపకాన్ని చేపడుతోంది. మిగిలిన 25 ఎకరాలను అలాగే వదిలేసింది. దీంతో ఆ భూమి అడవిలా మారింది. ఏ అధికారీ ఆ భూమిని పట్టించుకున్న పాపాన పోలేదు. జంగిల్ క్లియరెన్స్‌కు నోచుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. చుట్టూ ఉన్న భూమిని కొందరు ఇప్పటికే ఆక్రమించారు. ఆ స్థలంలో జంగిల్ క్లియరెన్స్ చేసి సర్వే చేపట్టాల్సి వుంది. మత్స్యశాఖకు కేటాయించిన ఈ స్థలం ఎటు వైపు నుంచి వచ్చినా జిల్లా ప్రజలకు అనుకూలంగా ఉంటుంది. ఆత్మకూరు వైపు నుంచి వచ్చినా పట్టణంలోకి వెళ్లకుండానే నేరుగా అక్కడకు చేరుకోవచ్చు. గిద్దలూరు, ఆళ్లగడ్డ నుంచి వచ్చే వాహనదారులు కూడా పట్టణంలోకి రాకుండానే పెద్దకొట్టాల మీదుగా అక్కడకు చేరుకోవచ్చు. పాణ్యం, బనగానపల్లె వైపు నుంచి వచ్చే వాహనాలు కూడా హైవేలో నుంచి పెద్దకొట్టాల మీదుగా చేరుకోవచ్చు. కాబట్టి ఆ ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించవచ్చు. లేదా మార్కెట్‌యార్డుకు ఆ భూమిని కేటాయించి అభివృద్ధి చేయవచ్చు. కేసీ కెనాల్‌కు ఆనుకుని ఉండడంతో నీటి సమస్య ఉండదు. ముంపు సమస్య అసలే లేదు. ఇంత విలువైన స్థలాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన మత్స్యశాఖ అధికారులు మరో చేప పిల్లల పెంపకం కేంద్రానికి వెలుగోడు వద్ద భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరడం విడ్డూరం.

వృద్ధిరేటు పెరగాలి

- ప్రణాళికలు రూపొందించండి
- ప్రత్యేక అధికారి నివాస్


సమావేశంలో మాట్లాడుతున్న నివాస్

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వృద్ధిరేటు 15శాతం సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆ మేరకు క్షేత్రస్థాయిలో అమలు చేయాలని రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి నివాస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్‌హాల్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాల స్థూల జాతీయోత్పత్తి 15 శాతం వృద్ధిరేటుపై కలెక్టర్ రాజకుమారితో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా అభివృద్ధికి 15శాతం వృద్ధిరేటుతో ముందుకెళ్లాలని సూచించారన్నారు. గతేడాది జిల్లా గ్రాస్ డిస్ట్రిక్ట్ డెమోస్ట్రిక్ ప్రొడక్ట్‌గా రూ.43,630 కోట్లుగా ఉందని, ఈ ఏడాది వ్యవసాయ, వాటి అనుబంధ రంగాల్లో 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా రూ.50,726కోట్లకుపైగా పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు తక్కువ ఖర్చుతో అధికలాభం వచ్చేలా దృష్టిపెట్టాలన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో అధికశాతం ఉద్యానపంటల విస్తరణతోపాటు సోయాబీన్, పండ్లతోటల అభివృద్ధిచేస్తే వృద్ధిరేటు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలోని దొర్నిపాడు, ఉయ్యాలవాడ, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల మండలాల్లో ఒకేపంటకు పరిమితం కాకుండా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. సమ్మర్ యాక్షన్‌ప్లాన్‌కు సంబంధించి జిల్లాలోని 13 సమ్మర్ స్టోరేజ్‌ట్యాంక్‌లను పూర్తిస్థాయిలో నింపేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'పది' మూల్యాంకనం



నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్‌డీఆర్ ఏప్రిల్ 3వ తేదీ నుంచి 10వ తరగతి జవాబుపత్రాల మూల్యాంకనం నిర్వహిస్తున్నట్లు డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఈనెల 3వతేదీ నుంచి 9వ తేదీ వరకు మూల్యాంకనం పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. మూల్యాంకనం కోసం 168 చీఫ్ ఎగ్జామినర్లు, 966 మంది సహాయ ఎగ్జామినర్లు, 205 మంది ప్రత్యేక సహాయకులను నియమించామని తెలిపారు. అలాగే జిల్లాకు 1,90,000 జవాబు పత్రాలను కేటాయించారని, మూల్యాంకనం కోసం నియమించిన ఉపాధ్యాయులు ఈనెల 3వ తేదీన ఉదయం 9గంటలలోపు ఎస్‌డీఆర్ పాఠశాలకు చేరుకోవాలన్నారు.

ముగిసిన పది పరీక్షలు

సోషల్ పరీక్షకు 381 మంది విద్యార్థులు గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 130 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పదో తరగతి పరీక్షలు మంగళవారం ముగిశాయి. 458 ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల నుంచి 25542 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈవో జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని అన్నారు. మంగళవారం నిర్వహించిన సాంఘికశాస్త్రం పరీక్షకు 24,855 మంది విద్యార్థులు హాజరుకావాల్సి వుండగా 24,4,74 మంది హాజరయ్యారని అన్నారు. 381 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు 17 పరీక్షా, సిట్టింగ్ స్క్వాడ్ 20 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారని అన్నారు.


పరీక్షా కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థినులు

నేడు చౌడేశ్వరిదేవి జ్యోతి మహోత్సవం

బనగానపల్లె, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : నందవరం చౌడేశ్వరిదేవి ఉగాది బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు బుధవారం అర్ధరాత్రి(తెల్లవారితే గురువారం) జ్యోతి మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ జి.కామేశ్వరమ్మ, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి తెలిపారు. ఉదయం అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, పసుపు, కుంకుమ, పట్టు వస్త్రముల అలంకరణ, సాయంత్రం 5 గంటలకు అభయహస్త సేవాసమితి ధర్మరం వారిచే అన్నమయ్య సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్ధరాత్రి 12 గంటలకు భాస్కరయ్యాచారితో నందవరం చౌడేశ్వరీమాత అమ్మవారికి దిష్టిచుక్క పెట్టే కార్యక్రమం, 1 గంట నుంచి జ్యోతి మహోత్సవం ప్రారంభమవుతుందన్నారు.

నకిలీ పత్రాలతో మహా మోసం 7లో

వైసీపీ ఇక అధికారంలోకి రాదు

- అసెంబ్లీ నుంచి పారిపోయిన జగన్ అండ్ కో
- వైసీపీ నేతలపై మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఫైర్


అమడాలలో లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేస్తున్న మంత్రి బీసీ

కోవెలకుంట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఇకపై జన్మలో వైసీపీ అధికారం చేపట్టే అవకాశాలే లేవని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో ప్రజల పక్షాన నిలబడి పోరాడకుండా తోకముడిచి పారిపోయిన వైసీపీ నాయకుడు జగన్ అని విమర్శించారు. మంగళవారం కోవెలకుంట్ల మండలం అమడాల గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మంత్రి పంపిణీ చేశారు. ఉదయమే గ్రామానికి చేరుకున్న మంత్రి ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంపిణీ చేశారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి బీసీ అన్నారు. వైసీపీ ప్రభుత్వం మళ్లీ జన్మలో కూడా అధికారంలోకి రాలేదని మంత్రి ఎద్దేవ చేశారు. రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని అనాథను చేసిన ఘనత వైసీపీకి చెందుతుందన్నారు. ఈ నెలలో గౌరవ ప్రధాని మోదీ చేతుల మీదుగా అమరావతి రాజధానికి తిరిగి పునాదులు వేస్తున్నామని తెలిపారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఆర్‌అండ్‌బిలో రూ.12వేల కోట్లు బకాయి పెండింగ్ పెడితే నేడు వాటిని తీర్చామన్నారు. అంతేకాకుండా రూ.1500 కోట్ల వ్యయంతో దాదాపు 19వేల కి.మీ రహదారులను గుంతలు లేని రహదారులుగా తీర్చిదిద్దామన్నారు. సీ కేటగిరి కింద రాష్ట్రంలో చాలా రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయని, వాటి కోసం మరో రూ.800 కోట్లు విడుదల చేశామని మంత్రి అన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న టీడీపీని విమర్శించే అర్హత వైసీపీకి లేదన్నారు. ప్రతిపక్ష నాయకుడు అంటే ప్రజల సమస్యలపై పోరాడాలని, అసెంబ్లీలో ప్రజల తరపున గళమెత్తాలి కానీ అసెంబ్లీ సమావేశాలకు రాకుండా పారిపోవడం ఏమిటన్నారు. అనుకూల మీడియాను అడ్డుపెట్టుకుని విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఏదైనా ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని హితవు పలికారు. ఒక్కమాటలో చెప్పాలంటే చట్టసభలకు రాకుండా జీతాలు తీసుకునే హక్కు వైసీపీ ఎమ్మెల్యేలకు లేదన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత కోచింగ్

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బీ.తాండ్రపాడు ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష కోసం ఉచిత కోచింగ్ ఇచ్చి స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎంవీఎస్ఎస్ఎన్ ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈ నెల 2వ తేదీ నుంచి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిపుణులైన అధ్యాపకులతో శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9492403015 ను సంప్రదించాలని తెలిపారు.

ఉగాది ఆదాయం రూ.47.31 లక్షలు

మహానందీశ్వరుడికి గత ఏడాది కంటే రూ.5.06 లక్షలు అధికం

మహానంది, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మహానంది క్షేత్ర దర్శనానికి వచ్చిన కన్నడ భక్తుల రద్దీ వల్ల దేవస్థానానికి రూ.47,31,792 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు.ఇందులో సేవా టికెట్ల విక్రయంతో పాటు లడ్డు ప్రసాదాలు, తాత్కాలికంగా ఏర్పాటు చేసుకొన్న దుకాణాల ద్వారా ఈ ఆదాయం వచ్చిందన్నారు. గత ఏడాది ఉగాది కన్నడ భక్తుల రద్దీ వల్ల రూ.42,24,818 ఆదాయం రాగా ఈ ఏడాది 5,06,974 ఆదాయం అధికంగా వచ్చిందని ఈవో పేర్కొన్నారు.

ఆర్టీసీకి పెరిగిన ఉగాది ఆదాయం: డీఎం

నంద్యాల మున్సిపాలిటీ ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ సందర్భంగా నంద్యాల ఆర్టీసీ డిపో ఆదాయం పెరిగిందని నంద్యాల డిపో మేనేజర్ గంగాధర్ తెలిపారు. గత సంవత్సరం ఉగాది సందర్భంగా నంద్యాల ఆర్టీసీకి రూ. 10,41,683 ఆదాయం రాగా ఈ సంవత్సరం రూ. 10,79,588 వచ్చినట్లు డీఎం తెలిపారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.6.10 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

శ్రీశైలం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లకు భక్తులు సమర్పించిన హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ఆలయంలోని చంద్రావతి కల్యాణమండపంలో గడిచిన 27 రోజులకు సంబంధించి జరిగిన హుండీ లెక్కింపులో రూ.6.10 కోట్లు ఆదాయం సమకూరింది. దీంతో పాటు 20.1 తులాల బంగారు, 6.2 కిలోల వెండి లభించింది. అదేవిధంగా 990 యుఎస్ఏ డాలర్లు, 10 సింగపూర్ డాలర్లు, 16 మలేషియా రింగట్స్, 30 ఆస్ట్రేలియా డాలర్లు, 20 యూకే పౌండ్స్, 810 యుఏఈ దిర్హమ్స్, 250 మెక్సికో పిసో, 130 కెనడా డాలర్ల విదేశీ కరెన్సీ వచ్చింది. పటిష్టమైన భద్రత మధ్య ఈ లెక్కింపు జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎం.శ్రీనివాసరావు, డీఈఓ రమణమ్మ, అధికారులు, సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.

విద్యా విధానంలో విపరీత ధోరణి

- పది పరీక్షలు ముగియక ముందే ఇంటర్ తరగతులు
- మొదటిరోజు 10శాతం కూడా హాజరుకాని విద్యార్థులు
- విద్యా విధానం పట్ల అవగాహన లేమి కారణమంటున్న నిపుణులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 01 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాశాక, ఇంటర్ తరగతులు మొదలు కావడం హేతుబద్ధం. అట్లాంటిది ఈసారి పది పరీక్షలు పూర్తి కాకముందే ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తరగతులు నిర్వహిస్తున్నారు. వేసవి సెలవులకు ముందే 23 రోజుల పాటు ఇంటర్ తరగతులు నిర్వహించి, మొదటి సంవత్సరం అడ్మిషన్‌లు పెంచాలనే ప్రభుత్వం అనుకుంటోంది. కార్పొరేట్ విద్యావిధానం వల్ల ఇంటర్మీడియట్ విద్య ప్రభుత్వ రంగంలో దాదాపుగా దెబ్బతినిపోయింది. దీంతో ఇంటర్‌లో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చేరేవారే కరువయ్యారు. ఈ సమస్యకు పరిష్కారం కోసం వేసవిలోనే తరగతులు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఒకవైపు ఏప్రిల్ 5వ తేదీ దాకా ఇంటర్ ప్రశ్నాపత్రాల మూల్యాంకనంలో అధ్యాపకులు తీరిక లేకుండా ఉన్నారు. 10వ తరగతి ప్రశ్నాపత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 3న మొదలై 9వ తేదీ దాకా జరిగుతాయి. ఆ తర్వాత ఫలితాలు వస్తాయి. ప్రభుత్వం హడావుడిగా ఏప్రిల్ 1నుంచే ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తరగతులకు హాజరుకావాలని ఆదేశించడం విడ్డూరమనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ విధానంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో గందరగోళం నెలకొన్నది.



మొదటిరోజు తరగతికి హాజరైన ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు

ప్రభుత్వం ఏ విధానం అమలు చేసినా ఆచరణలో ప్రజలకు సౌకర్యంగా ఉండాలి. కానీ ఇంటర్ తరగతుల్లో ప్రభుత్వం గందరగోళంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పదో తరగతి హాల్ టిక్కెట్ ఆధారంగా ఈనెల 7వతేదీ నుంచి ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశం పొందేలా ప్రభుత్వం వెసులుబాటు కల్పించినప్పటికీ ఆ దిశగా ముందుగానే విద్యార్థుల్లో, వారి తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించడంలో విద్యాశాఖ కాస్త నిర్లక్ష్యం వహించిందనే చెప్పవచ్చు. మంగళవారం అనేక ప్రైవేట్ కళాశాలల్లో ఒక్క విద్యార్థి కూడా హాజరు కాలేదు. దీనిపై కళాశాలల యాజమాన్యాన్ని ఆంధ్రజ్యోతి పలుకరించగా.. పరీక్షలు ఇటీవలే ముగియడం వల్ల విద్యార్థులు మళ్లీ వెంటనే కళాశాలకు రావడానికి ఇష్టపడడం లేదని అన్నారు. అధ్యాపకులు కూడా జవాబు పత్రాల మూల్యాంకనంలో బిజీగా ఉన్నారని చెప్పారు. నంద్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాత్రం 273 మంది విద్యార్థులకు గాను కేవలం 22 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులు పరీక్షలు అయిపోగానే వారి సొంత ఊర్లకు వెళ్లిపోయారు. మధ్యలో వస్తే హాస్టళ్లలో వారికి భోజనం, సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం అనుకోలేదు. దీంతో ఇంటర్ తరగతులపై అధికారులు, నిపుణుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మధ్యాహ్నం వరకే నిర్వహించాలి



ఇంటర్ ద్వితీయ సంవత్సరం 23 రోజుల తరగతులను మధ్యాహ్నం వరకు మాత్రమే నిర్వహిస్తే బాగుంటుంది. వేసవి వడగాల్పుల వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఉండే వీలుంటుంది. నూతన విద్యావిధానం వల్ల విద్యార్థులకు మంచి జరుగుతున్నా లోటుపాట్లను సవరించుకుని ముందుకెళితే బాగుంటుంది. ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలపై విద్యార్థుల్లో ఆసక్తి ఉంది. మంచి నిపుణులైన అధ్యాపకులు ఉన్నారు.

- శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి

ప్రభుత్వ విధానం భేష్



ప్రభుత్వ విద్యావిధానం బాగుంది. 23 రోజుల తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటే ఎన్నో ప్రయోజనాలున్నాయి. ఇప్పటికే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు బుక్స్, రికార్డ్ బుక్స్ సిద్ధంగా ఉన్నాయి. నిర్దేశిత మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకం కూడా 23 రోజులు అమలు చేస్తున్నాం. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు వీలుగా ఈనెల 7వ తేదీ నుంచి బ్రిడ్జి క్లాసులు కూడా ప్రారంభిస్తున్నాం. ఈనెల 24వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు వేసవి సెలవులుంటాయి. విద్యార్థులు తప్పనిసరిగా తరగతులకు హాజరుకావాలి.

- చక్రధర్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్

విద్యార్థుల తల్లిదండ్రుల్లో అవగాహన పెంచాలి



ఒక్కసారిగా హడావుడిగా కాకుండా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించి తరగతులను ప్రారంభించి ఉంటే బాగుండేది. ఒకవైపు ఇంటర్ మూల్యాంకనం జరుగుతుండగా, మరోవైపు 10వ తరగతి మూల్యాంకనం ప్రారంభిస్తున్న తరుణంలో ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సాహసోపేతమే. ఈ విధానంతో నష్టం లేదు.

- శివయ్య, ఐక్య ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షుడు, నంద్యాల

సంస్కరణలకు అనుగుణంగానే ముందుకెళ్తాం



ఇంటర్ విద్యలో ప్రవేశపెట్టిన నూతన విధానాలు అమలయ్యేలా పటిష్ట చర్యలు తీసుకుని ముందుకెళ్తాం. ఇంటర్ మూల్యాంకనం జరుగుతున్నా, ఖాళీగా ఉన్న అధ్యాపకులచేత తరగతులు నిర్వహించి ఈనెల 23 వతేదీ నాటికి 18నుంచి 20శాతం సిలబస్ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల వద్దకు అధ్యాపకులను పంపి ప్రభుత్వ కళాశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యా విధానం గురించి వివరించాం. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్‌లకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. 10వ తరగతి విద్యార్థుల పాస్, ఫెయిల్ అనే దానితో సంబంధం లేకుండా ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్‌లు పొందవచ్చు. ఫెయిల్ అయిన విద్యార్థులకు సప్లిమెంటరీ రాసుకునే వీలుంటుంది.

- సునీత, డీఐఈవో, నంద్యాల జిల్లా

నేడు ఎమ్మెల్సీ బీటీ నాయుడు ప్రమాణ స్వీకారం

- అమరావతికి చేరుకున్న టీడీపీ శ్రేణులు
- 8న కర్నూలులో భారీ సన్మానం



కర్నూలు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేల కోటా నుంచి ఎమ్మెల్సీగా రెండో దఫా ఎన్నికైన బీటీ నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. శాసనమండలి ఛైర్మన్ మోషెన్ రాజు చేత ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. రాష్ట్రంలో గత నెల 29న ఖాళీ అయిన ఐదు ఎమ్మెల్సీలను కేంద్ర ఎన్నికల సంఘం భర్తీ చేసింది. టీడీపీ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన బీటీ నాయుడు ప్రమాణ స్వీకారానికి సన్నాహాలు చేస్తున్నారు. టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లు బీటీ నాయుడుపై నమ్మకంతో రెండోసారి అవకాశం ఇచ్చారు. ఈ క్రమంలో ఆయన ప్రమాణస్వీకారానికి శాసన మండలిలో ఏర్పాట్లు చేశారు. కోసిగి మండలం జుమాలదిన్నె గ్రామానికి చెందిన బెందుల బుడ్డన్న, అయ్యమ్మ దంపతుల కుమారుడు బీటీ నాయుడు ఎంఏ, ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన ఆయన ఆదోని, కర్నూలు, ఎమ్మిగనూరులో 12 ఏళ్లపాటు న్యాయవాద వృత్తిని కొనసాగించారు. రాయలసీమలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వాల్మీకులు/బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ వాల్మీకి సింహగర్జన సభలు నిర్వహించి సక్సెస్ అయ్యారు. 1994లో అప్పటి ఆదోని ఎమ్మెల్యే కే.మీనాక్షినాయుడు సమక్షంలో టీడీపీలో చేరి క్రియాశీలక సభ్యత్వం తీసుకున్నారు. ఆదోని నియోజకవర్గం టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడుగా టీడీపీలో రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టిన ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. అధినేత చంద్రబాబు కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా మారారు. రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా మూడు పర్యాయాలు పని చేశారు. కడప, అనంతపురం పార్లమెంటు స్థానం ఇన్‌చార్జిగా పని చేశారు. 2009, 2014 ఎన్నికల్లో కర్నూలు పార్లమెంటు స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా రెండు పర్యాయాలు పోటీ చేసి ఓడిపోయారు. 2019లో టీడీపీ ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికై ఆరు సంవత్సరాలు ఆ పదవిలో కొనసాగారు. గత నెల 29న ఆయన పదవీకాలం ముగిసింది. అదే కోటాలో రెండో పర్యాయం కూడా అధినేత చంద్రబాబు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు.

అమరావతికి చేరుకున్న టీడీపీ శ్రేణులు:

బీటీ నాయుడు నేడు ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేయనుండటంతో ఆదోని, ఆలూరు, మంత్రాలయం ఎమ్మిగనూరు నియోజకవర్గాల నుంచి బీటీ నాయుడు అభిమానులు, పలువురు టీడీపీ శ్రేణులు మంగళవారం అమరావతికి బయలుదేరారు. దాదాపు 50కి పైగా వాహనాల్లో అమరావతికి చేరుకున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి యువనేత, మంత్రి లోకేశ్, ఉమ్మడి జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా హాజరవుతారు. ఇదిలా ఉండగా 8వ తేదీన కర్నూలు జిల్లా టీడీపీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఉంటుంది.

ఆంధ్రజ్యోతి కథనంతో పరీక్షలు రాశా..

- ఇక చదువు ముగిసిపోయిందని నిరాశకు గురయ్యాను
- వలస నుంచి వచ్చి పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థి
- భావోద్వేగానికి గురైన విద్యార్థిని సన్నక్కి



విద్యార్థిని చిన్నారి సంతోషం

కోసిగి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాయాల్సిన విద్యార్థిని తల్లిదండ్రులతో కలిసి మిర్చి పొలాల్లో కూలీ చేయడానికి వలస వెళ్లింది. కోసిగి మండల పరిధిలోని చింతకుంట గ్రామానికి చెందిన సన్నక్కి చిన్న మారెప్ప, కమలమ్మ దంపతుల కుమార్తె. పదో తరగతి చదువుతున్న సన్నక్కి గుంటూరు జిల్లా పేరచెర్ల పొలాల్లో మిర్చి కోసే కూలీ పని చేస్తోందని ఆంధ్రజ్యోతి ప్రతినిధి విద్యార్థిని కూలి పని చేస్తున్న ఫొటోను, బడిలో చదువుతున్నప్పటి యూనిఫాంలో ఉన్న ఫొటోను సేకరించారు. పరీక్ష హాలులో కాదు.. వలస వెళ్లి పొలంలో.. అనే శీర్షికతో మార్చి 19న ఆంధ్రజ్యోతి ప్రధాన పత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. గుంటూరు, కర్నూలు జిల్లాల కలెక్టర్లు విద్యార్థిని పరీక్ష రాసేలా చర్యలు తీసుకున్నారు. దీంతో మూడో పరీక్ష నుంచి కోసిగిలోని మౌంట్ కార్మెల్ పరీక్ష కేంద్రంలో సన్నక్కి తన స్నేహితులతో కలిసి నాలుగు పరీక్షలు రాసింది. మంగళవారం చివరి పరీక్ష రాశాక సన్నక్కి తన ఆనందాన్ని పంచుకుంది. స్నేహితులతో కలిసి ఇట్లా పరీక్ష రాస్తానని అనుకోలేదని, ఇక తన జీవితంలో చదువు ముగిసిపోయిందని అనుకున్నా అని అన్నది. ఆంధ్రజ్యోతి సహకారంతో పరీక్షలు రాశానని ఆనందం వ్యక్తం చేసింది.

కళాకారులకు పెరిగిన ఆదరణ

డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్



డీఐజీ కోయ ప్రవీణ్‌ను సత్కరిస్తున్న పత్తి ఓబులయ్య, పాండురంగయ్య తదితరులు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సమాజంలో కళలు, కళాకారులకు ఆదరణ పెరుగుతోందని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ అన్నారు. ఇటీవల ప్రతిష్ఠాత్మక కళారత్న(హంస) పురస్కారం అందుకున్న టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్యతో పాటు కళాక్షేత్రం సభ్యులు, కళాకారులు డీఐజీని ఆయన కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కళారత్న, హంస పురస్కార గ్రహీత పత్తి ఓబులయ్యను అభినందించారు. అనంతరం కళాక్షేత్రంలో జరుగుతున్న కార్యక్రమాలు, కళాకారులకు ఇస్తున్న అవకాశాలపై డీఐజీ అడిగి తెలుసుకున్నారు. సమాజంలో కళాకారులకు ప్రస్తుతం కళలపై ఆదరణ పెరుగుతోందన్నారు. ప్రతి ఒక్కరూ అవకాశాలను అందిపుచ్చుకుని ఉత్తమ కళాకారులుగా ఎదగాలన్నారు. అనంతరం డీఐజీని కళాక్షేత్రం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎంలు ప్యాలకుర్తి ఎర్రమ పాండురంగయ్య, నాగేశ్వరరావు, పి. భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయే ప్రభుత్వంలో కళాకారులకు గుర్తింపు



ఎమ్మెల్యే దంపతులతో పురస్కారగ్రహీత ప్రసాద్

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రభుత్వం కళాకారులకు తగిన గుర్తింపు అందించి ప్రోత్సహిస్తోందని కళాకారుడు ఎస్ఆర్ఎస్ ప్రసాద్ అన్నారు. కళాకారుడు ఎస్ఆర్ఎస్ ప్రసాద్ ఉగాది ఉత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా కళారత్న (హంస) అవార్డు అందుకున్నారు. దీంతో ఆయన ఆళ్లగడ్డలోని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, భార్గవ్‌రామ్ దంపతులను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో బాల అకాడమీ కరస్పాండెంట్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

ఎండలు ప్రజలు విలవిల..!

- అధికమవుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- కర్నూలు నగరంలో కానరాని చలివేంద్రాలు
- చలువ పందిళ్ల ఏర్పాటులోనూ నిర్లక్ష్యమే

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గతేడాది కంటే ఈసారి ఎండలు అధికమయ్యాయి. పగటి ఉష్ణోగ్రతలను చూస్తుంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. భానుడి ఉగ్రరూపంతో ఎండ వేడిమికి జనం అల్లాడుతున్నారు. ఉదయమే మధ్యాహ్న వాతావరణాన్ని తలపిస్తోంది. తాజాగా మంగళవారం కర్నూలు నగరంలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇదిలా ఉంటే తాగునీటి కేంద్రాలు లేక, నీడ కోసం చలువ పందిళ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నగరానికి పనులు నిమిత్తం వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున వస్తుంటారు. వేసవి నేపథ్యంలో వీరి సౌకర్యార్థం చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. నిజానికి గతేడాదిలో మార్చి, ఏప్రిల్ నాటికి చలువ పందిళ్లు, ట్రాఫిక్ కూడళ్లలో గ్రీన్ డేరాలు ఏర్పాటు చేశారు. కానీ ఈసారి మాత్రం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఎక్కడా వీటి జాడ కనపడలేదు. చివరికి ప్రజలు అక్కడక్కడా స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన చలివేంద్రాల్లో నీటిని తాగుతూ దప్పిక తీర్చుకుంటున్నారు.



బళ్లారి చౌరస్తాలో లేని నీడ వసతి



రాజవిహార్ ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద



రాజవిహార్ సర్కిల్‌లో కానరాని గ్రీన్ టెంట్



కలెక్టరేట్ ఎదుట ఎండలో ప్రజలు



కర్నూలు నగరానికి చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు ఎమ్మిగనూరు, ఆదోని, నంద్యాల తదితర ప్రాంతాల నుంచి సైతం జనం వస్తుంటారు. ముఖ్యంగా సి.క్యాంపు, నంద్యాల చెక్‌పోస్టు, ఆర్ఎస్‌రోడ్డు, వీకర్ సెక్షన్ కాలనీ, వై.జంక్షన్, రాజవిహార్, బళ్లారి చౌరస్తా, ప్రభుత్వ సర్వజన వైద్యశాల తదితర ప్రాంతాలు నిత్యం జనసంచారంతో కిటకిటలాడుతూ ఉంటాయి. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండడంతో దాహంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఆయా కూడళ్ల వద్ద చలివేంద్రాలు లేవు. నగరంలో రూ.వందల కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేస్తున్నట్లు అధికారులు, పాలకులు గొప్పలు చెబుతున్నారు. కానీ ప్రజలకు మాత్రం గుక్కెడు నీరు, ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు చలువపందిళ్లు ఏర్పాటు చేయకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కరువు కనిపించడం లేదా?

- కర్నూలు అర్బన్‌ను కరువు మండలంగా ఎలా ప్రకటిస్తారు?
- వలసలున్నా ఆ మండలాల్లో కరువు కనిపించడం లేదా..?
- ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శుల ధ్వజం

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రబీలో నష్టపోయిన మండలాలు జిల్లాలో 9 మాత్రమే ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించడం దారుణమని, అందులో కర్నూలు అర్బన్ మండలాన్ని కరువు మండలంగా ఎలా ప్రకటిస్తారని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రామకృష్ణ తీవ్రంగా విమర్శించారు. మంగళవారం రైతు సంఘం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో 51 మండలాల్లో కరువు ఉన్నట్లు ప్రకటించి అందులో పంటలు పూర్తిగా ఎండిపోయి ప్రజలు వలసబాట పట్టిన కర్నూలు జిల్లాలోని హొళగుంద, హాలహర్వి, ఆలూరు, పెద్దకడుబూరు, గూడూరు, బెళగల్, పత్తికొండ, దేవనకొండ, తుగ్గలి మండలాలను కరువు మండలాల జాబితాలో చేర్చకపోవడం దారుణమని ఆరోపించారు.

కానిస్టేబుల్‌పై ఫిర్యాదు

కర్నూలు క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వెంగన్న అనే కానిస్టేబుల్‌పై కల్లూరు ఇందిరమ్మకట్ట కాలనీకి చెందిన అరవింద్ అనే యువకుడు మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఉగాది ఉత్సవాల సందర్భంగా కానిస్టేబుల్ వెంగన్న విధులు నిర్వహిస్తున్నాడు. అరవింద్ అనే యువకుడు తన ఇంటికి వెళ్లేందుకు కొత్తబస్టాండు వైపు నుంచి కల్లూరు మీదుగా వెళ్లాడు. విధుల్లో ఉన్న కానిస్టేబుల్ వెంగన్న ఆ యువకుడిని అడ్డుకుని ఇటువైపు వెళ్లకూడదని ఆగ్రహం చేశాడు. తన ఇల్లు ఇక్కడేనని ఆ యువకుడు వేడుకున్నా కానిస్టేబుల్ వినలేదు. పైగా ఆగ్రహానికి గురై యువకుడిపై దాడి చేశాడు. తనను తీవ్రంగా కొట్టడంతో ఎడమచేయికి తీవ్రంగా గాయమైందని ఆ యువకుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ సీఐ మధుసూదన్‌గౌడ్ కేసు నమోదు చేసుకున్నారు. ఫిర్యాదుపై విచారణ చేపడుతున్నామని సీఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి

- ముగ్గురిపై కేసు నమోదు

గోనెగండ్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దనేలటూరు గ్రామంలో శేషం చిన్న రంగన్నపై ఆదే గ్రామానికి చెందిన ఆశోక్‌తో పాటు మరో ఇద్దరు నీటి జగ్గుతో దాడిచేసి గాయపరిచారు. శేషం చిన్నరంగన్న పంచాయతీ అధికారులు అనుమతితో తన ఇంటి దగ్గర తాగునీటి కొళాయిని వేసుకోవాలనుకున్నాడు. అందులో భాగంగా మంగళవారం చిన్న రంగన్న పైప్ లైన్ కోసం గుంతను తవ్వుతుండగా ఆశోక్, మరో ఇద్దరు వ్యక్తులు వచ్చి తమ ఇంటి ముందు గుంతను తవ్వకూడదని అడ్డుకున్నారు. అయితే గ్రామ పంచాయతీ అధికారులు గుంత తవ్వుకోమని అనుమతి ఇచ్చారని ఆయన చెప్పాడు. దీంతో ఆగ్రహానికి లోనైన ఆశోక్, మరో ఇద్దరు శేషం చిన్న రంగన్నతో ఘర్షణకు దిగారు. పక్కనే ఉన్న నీటి జగ్గుతో శేషం చిన్న రంగన్న తలపై బాదారు. రంగన్న తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యసేవల కోసం కర్నూలు ఆసుపత్రికి రంగన్నను తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు.

మట్కా బీటర్ల అరెస్టు.. రిమాండ్

కోసిగి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కోసిగి ఆర్టీసీ బస్టాండు వెనకాల ముగ్గురు పేకాట ఆడుతుండగా కోసిగి ఆర్టీసీ బస్టాండు వెనుకాల కర్ణాటక మద్యం అమ్ముతూ మట్కాబీటు రాస్తున్నారనే సమాచారంతో కోసిగి ఎస్ఐ జి. హనుమంతరెడ్డి తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. వారి వద్ద నుంచి 330 అక్రమ కర్నాటక మద్యం ప్యాకెట్లు, రూ.6,250 నగదును సీజ్ చేసి కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు పంపించారు.

భార్యపై గొడ్డలితో దాడి

ఆలూరు రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారం గ్రామంలో భార్య కవితపై భర్త వీరేష్ మద్యం మత్తులో గొడ్డలితో దాడి చేశాడు. వివరాల మేరకు.. కదరి తాలూకా సింగంపల్లికు చెందిన కవితను, వీరేశ్ ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే కొంతకాలంగా మద్యానికి బానిసైన వీరేష్ ఇంట్లో భార్యతో తరచూ గొడవపడుతుండేవాడు. మంగళవారం సాయంత్రం తాగి వచ్చి, భార్యపై విచక్షణా రహితంగా గొడ్డలితో దాడి చేశాడు. స్థానికులు అడ్డుకొని భర్తకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గాయపడిన భార్యను హుటాహుటిన ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బావిలో పడి గొర్రెల కాపరి మృతి

చిప్పగిరి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు మండలం కసాపురం గ్రామ శివారులోని బావిలో పడి గొర్రెల కాపరి రామాంజినేయులు(30) మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు కసాపురం పోలీసులు తెలిపారు.


రామాంజిని (ఫైల్)

కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం నంచర్లకు చెందిన రామాంజినేయులు గొర్రెలను తీసుకొని కసాపురం గ్రామ శివారులోని బావి వద్దకు వచ్చాడన్నారు.బావిలోనీరు తాగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి పడిఉంటాడన్నారు. గమనించిన స్థానికులు రామాంజినేయులను బావిలో నుంచి బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని కసాపురం పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈవిషయంలో విచారణ చేస్తున్నట్లు కసాపురం పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య కష్ట వేణి, ఇద్దరు పిల్లలు మహేష్ (7), పార్థు (5) ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

గూడూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.నాగలాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో లల్లు యాదవ్(34) అనే యువకుడు మృతి చెందాడు. కర్నూలు మండలం నిడ్జూరుకు చెందిన లల్లు యాదవ్ బైక్‌పై గూడూరు వైపు వస్తుండగా సల్కాపురం సమీపంలో ఎదురుగా వస్తున్న అంబులెన్స్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లల్లు యాదవ్ అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆశలత తెలిపారు.

కారు షెడ్డులో అగ్నిప్రమాదం

ఆదోని, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయిబాబా నగర్‌లో మంగళవారం కారుషెడ్డులో అగ్నిప్రమాదం సంభవించింది. వివరాల మేరకు హాజీస్ అనే వ్యక్తి అక్కడ కారు మరమ్మతుల షెడ్‌ను నిర్వహిస్తున్నారు. మంగళవారం మంటలు చెలరేగడంతో అదుపు చేయడానికి ప్రయత్నించినా విఫలమయ్యాడు. అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను ఆదుపు చేశారు. సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు హాజీస్ తెలిపారు.

రైల్వే ఇనుప సామగ్రి చోరీ

మహానంది, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు- గుంతకల్లు రైల్వే ఆధునీకరణలో భాగంగా జరుగుతున్న నిర్మాణ పనుల్లో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఇనుప సామగ్రిని దొంగలించుకొని వెళ్లినట్లు సైట్ ఇంజనీర్ సమంత్‌కుమార్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసారు. రైల్వే డబుల్ ట్రాక్ నిర్మాణ పనులు మహానంది మండలం గాజులపల్లి ఆర్ఎస్ సమీపంలో జరుగుతున్నాయి. ఇందులో భాగంగా అక్కడ కాంట్రాక్టర్ ఏర్పాటు చేసుకొన్న ఇనుప సామగ్రి చోరీకి గురైందన్నారు. చోరీకి గురైన ఇనుప సామగ్రి విలువ రూ.2.50 లక్షలు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

నకిలీ పత్రాలు, ఫోర్జరీ సంతకాలతో

మహా మోసం!



ఆదోనిలోని శ్రీ మహాయోగి లక్ష్మమ్మ అవ్వ కో-ఆపరేటివ్ బ్యాంక్ ఇదే

- ఆదోని అవ్వ బ్యాంకులో రూ.3.24 కోట్ల రుణం
- తీసుకున్న రుణాన్ని చెల్లించని నిర్వాహకులు
- తాకట్టు భూమి వేలం వేసేందుకు సిద్ధమైన అధికారులు
- చివరికి ప్రభుత్వ స్థలంగా గుర్తింపు
- బ్యాంకు సీఈవోతో పాటు ముగ్గురిపై కేసు నమోదు

ఆదోని, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అది ప్రభుత్వ స్థలం.. ఆ స్థలానికి నాలుగు ఫోర్జరీ సంతకాలు, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించేసి ఏకంగా రూ.3.24 కోట్ల రుణం పొందారు ఆదోనికి చెందిన ఘనులు. అడిగిందే తడువుగా ఆదోనిలోని అవ్వ బ్యాంకు అధికారులు సైతం రుణాన్ని ఇచ్చేశారు. ఎన్నాళ్లకూ రుణం కట్టలేకపోవడంతో తాకట్టు పెట్టిన భూమిని వేలం వేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. తీరా భూమి వద్దకు వెళ్తే అది కాస్తా ప్రభుత్వ భూమి కావడంతో బ్యాంకు అధికారులు ఖంగుతిన్నారు. బ్యాంకులో తాకట్టుకోసం ఉంచిన పత్రాలన్నీ ఫేక్ డాక్యుమెంట్లుగా సబ్ రిజిస్ట్రార్ తేల్చేయడంతో బ్యాంకు అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఆదోని పట్టణంలో నివాసం ఉంటున్న ఎల్లే మల్లేశప్ప, ఎల్లే చిన్న బసవ, ఎల్లే చైత్రలు వీరు పట్టణంలోని శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో 60 సెంట్ల భూమి ఉన్నట్లు నకిలీ పత్రాలను సృష్టించారు. 2021 సంవత్సరంలో బ్యాంకు సీఈవో మురళి కృష్ణ సహకారంతో రూ.3.24 కోట్లు రుణం తీసుకున్నారు. నిజానికి సర్వే నెంబరు 24లో 4.50 ఎకరాల పొలం ఉంది. అందులో 4.50 ఎకరాలు టీచర్స్ సొసైటీ పేరిట 40 ఏళ్ల క్రితం రూ.90 వేలకు విక్రయించారు. అందులో తమకుటుంబ సభ్యులకు 60 సెంట్లు భూమి ఉన్నట్లు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు.

వెలుగు చూసిందిలా..!

రుణం తీసుకుని మూడేళ్లు కావస్తున్నా తీసుకున్న రుణానికి సకాలంలో రుణ కంతులను చెల్లించలేదు. బ్యాంకు అధికారులు పదే పదే నోటీసులు పంపించినా సమాధానం రాలేదు.. దీంతో బ్యాంకు అధికారులు రుణగ్రస్తులపై ఆరా తీశారు. మరోవైపు బ్యాంకులో తాకట్టు పెట్టిన భూమి పత్రాలను పరిశీలించారు. వాళ్లు ఒకవేళ రుణం చెల్లించకుంటే తనఖా పెట్టిన భూమినైనా వేలం వేసుకోవడానికి అవకాశం ఉంటుందని భావించారు. ఆ మేరకు తనఖా పెట్టిన భూమిని వేలం వేస్తున్నట్లు పత్రిక ప్రకటన కూడా ఇచ్చారు. అయితే అది సొసైటీ భూమి అని.. క్రయవిక్రయాలకు ఆస్కారం లేదని స్థానికుల నుంచి బ్యాంకు అధికారులకు అర్జీలు వెళ్లాయి. దీంతో బ్యాంక్ అధికారులు డాక్యుమెంట్లను సబ్ రిజిస్ట్రార్ అధికారుల సహాయంతో పరిశీలించారు. బ్యాంకుకు సమర్పించిన డాక్యుమెంట్లు నకిలీవి అని, అందులోని సంతకాలన్నీ ఫోర్జరీ చేసినట్లు సబ్ రిజిస్ట్రార్ తేల్చేశారు. దీంతో బ్యాంకు అధికారులు సంబంధిత సీఈవో గట్టు మురళికి నోటీసులు ఇచ్చారు. రూ.3.24 కోట్లు సంబంధించిన డాక్యుమెంట్ నకిలీవని అందుకు బాధ్యత వహించాలంటూ మెమో జారీ చేశారు. 2024 డిసెంబరు 4వ తేదీన సీఈవో గట్టు మురళిని సస్పెండ్ చేసి రూ.3.24 కోట్ల మొత్తానికి బ్యాంక్ అధికారులు వివరణ కోరారు. అందుకు మూడు నెలలు సమయం అడిగినట్లు ఆలోగా నగదును పూర్తిస్థాయిలో చెల్లించేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు బ్యాంక్ అధికారులు అంటున్నారు. మూడు నెలలు గడిచిపోయినా సీఈవో మురళి నుంచి ఎలాంటి స్పందన లేదు. చేసేదిలేక చివరకు అవ్వ బ్యాంకు చైర్మన్ రాచోటి సుబ్బయ్య వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బ్యాంకు సీఈవోనే సూత్రధారి..?

రుణానికి అవసరమైన డాక్యుమెంట్లు, భూమి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి రుణాలు మంజూరు చేయాల్సిన బాధ్యత సంబంధిత సీఈవోపై ఉంటుంది. అయితే 2021లో సర్వేనెంబర్ 24లో 60సెంట్ల భూమికి రూ.3.24 కోట్లు మంజూరు చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఇంత పెద్దమొత్తం రుణంగా ఇచ్చేటప్పుడు భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు సరిగ్గా ఉన్నాయా? లేదా? అని చూడకుండానే ఆగమేఘాలపై రుణాన్ని మంజూరు చేశారు. ఈ వ్యవహారంపై బ్యాంకు సీఈవో మురళి హస్తం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సీఈవో మురళితో పాటు ఎల్ల మల్లేషప్ప, చిన్న బసప్ప, చైత్ర నలుగురు కలిసి బ్యాంకును తప్పుదోవ పట్టించారని, నకిలీ పత్రాలతో రుణం పొందినట్లు బ్యాంకు చైర్మన్ రాచోటి సుబ్బయ్య ఫిర్యాదులో పేర్కొన్నారు.

నలుగురిపై కేసు నమోదు చేశాం



మహాయోగి లక్ష్మమ్మ అవ్వ కో-ఆపరేటివ్ బ్యాంకులో 2021లో నకిలీ భూమి డాక్యుమెంట్లను పెట్టి రూ.3.24 కోట్లను రుణంగా తీసుకొని ఆ మొత్తాన్ని చెల్లించలేదని బ్యాంకు చైర్మన్ రాయచోటి సుబ్బయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం. ఇందులో ఎవరి హస్తముంది, దీనివెనుక సూత్రధారులు ఎవరున్నారు. అన్నదానిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి త్వరలో వారిని అరెస్ట్ చేస్తాం. ఫోర్జరీ డాక్యుమెంట్లు, సబ్ రిజిస్ట్రార్ సంతకంతో పాటు అందుకు వాడిన సీళ్లు కూడా నకిలీవే అని గుర్తించాం. త్వరలో కేసును ఛేదిస్తాం.

- శ్రీరామ్, సీఐ, వన్ టౌన్, ఆదోని

ఈకేవైసీ.. పరేషన్


ఆలూరులో ఈకేవైసీ చేయించుకుంటున్న కార్డుదారులు

- గడువు ఏప్రిల్ 30వరకు పొడిగింపు
- రేషన్ కార్డుదారులు తప్పక వేలిముద్ర వేయాల్సిందే అంటున్న అధికారులు

ఆలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డుల్లో సభ్యుల నమోదు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు, లోపాల సవరణలకు ప్రతి సభ్యుడు ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఈనెలాఖరు వరకు గడువు విధించగా ఇంకా 50 శాతానికి పైగా కార్డుదారులు ఈకెవైసీ వేయకపోవడంతో దీని గడువు ఏప్రిల్ 30 వరకు పొడిగించారు. రేషన్ కార్డుదారులు తప్పక ఈకేవైసీ చేయించాల్సి ఉంది. లేకుంటే సంబంధింత సభ్యుడి పేరు కార్డులో ఉండే అవకాశం లేదు. దీనివల్ల రేషన్, ఇతర లబ్ధికి దూరం అవుతారు.

ఎక్కడైనా చేయించుకోవచ్చు...

ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఏ డీలరు వద్ద అయినా ఈకేవైసీ చేసుకోవచ్చు. డీలరుకు కార్డు సంఖ్య తెలియజేస్తే వేలిముద్ర వేయించుకుని, నమోదు చేస్తారు. అప్పుడే వ్యక్తి కార్డులో సభ్యుడిగా ఉన్నట్లు గుర్తింపు లభిస్తుంది. మీసేవా కేంద్రాలు, ఆధార్ కేంద్రాల్లో సైతం చేసుకునే వీలుంది. కార్డుల్లో ఉన్న చిన్నారులకు సంబంధించి ఆధార్ కేంద్రాలకు వెళ్లి అప్డేట్ చేస్తే ఈకేవైసీ ప్రక్రియ జరిగిపోతుందని డీలరులు, అధికా రులు తెలిపారు. ప్రస్తుతం డీలర్లు అవగాహన కల్పిస్తు న్నారు. శాశ్వత వలస మరణాలు, కొత్తగా పుట్టిన వారి వివరాలు తెలుసుకుంటున్నారు.

ఇవీ ప్రయోజనాలు

రానున్న రోజుల్లో ప్రభుత్వం కొత్త కార్డుల మంజూరు, కొత్త వ్యక్తులు, చిన్నారుల పేర్ల నమోదుకు శ్రీకారం చుట్టబోతోంది. దీనివల్ల ప్రస్తుతం కార్డుల్లో ఉన్న సభ్యుల పేర్లు తప్పిపోకుండా ఉండేందుకు, రెండు చోట్ల నమోదై ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ ప్రక్రియ చేపడుతున్నారు. ప్రభుత్వ పథకాలను రేషన్ కార్డు ఆధారగానే అందజేస్తారు. వీటన్నిటికి ఈకేవైసీ నమోదు ఉపయోగపడుతుంది. జిల్లాలో మొత్తం 6,76,209 రేషన్ కార్డులు ఉండగా ఇప్పటికి 50 శాతం మాత్రమే పూర్తి అయినట్లు అధికారులు తెలిపారు.

వేగవంతం చేయిస్తున్నాం



రేషన్ కార్డుల్లో ఉన్న ప్రతి సభ్యుడి ఈకేవైసీ చేసుకునేలా చర్యలు తీసుకుంటు న్నాం. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఈకేవైసీ జరిగేలా డీలర్‌లకు అవగాహన కల్పించి వేలిమ ద్రలు వేయిస్తున్నారు. ప్రక్రియ వేగవంతం చేస్తున్నాం. డీలర్లకు కూడా సమావేశం నిర్వహించి సూచనలు ఇచ్చాం. ఏప్రిల్ నెలాఖరు వరకు ప్రభుత్వం గడువు పెంచింది. ఆలోగా పూర్తి చేస్తాం. **-గోవింద్ సింగ్ తహసీల్దార్, ఆలూరు.**

ప్రభుత్వ కాలేజీల్లో చేరండి..!

- కరపత్రాలను పంపిణీ చేసిన అధ్యాపకులు


విద్యార్థులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

మంత్రాలయం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు పూర్తయిన విద్యార్థుల వెంటపడి కళాశాలల్లో చేరాలంటూ ప్రైవేట్ విద్యాసంస్థలు పోటీపడటం సర్వసాధారణం. కానీ అందుకు భిన్నంగా ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు పదో తరగతి విద్యార్థులు అవగాహన కల్పిస్తున్నారు. మంత్రాలయం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు మద్దిలేటి, జీవానందపాల్, అధ్యాపకులు రమేష్, ప్రభాకర్, వెంకటస్వామి తదితరులు మంగళవారం పదోతరగతి పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. విద్యార్థులను కలిసి ప్రభుత్వ కాలేజీలోని వసతులు, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు వంటి ఏర్పాట్లను వివరిస్తూ తమ కళాశాలలో చేరాలంటూ కోరారు.

దొంగలు బాబోయ్..!



- నంద్యాలలో ఒకే రోజు నాలుగు ఇళ్లలో చోరీ
- మరో రెండు ఇళ్లలో విఫలయత్నం


చోరీకి గురైన నంద్యాలలోని ఓ ఇల్లు

నంద్యాల క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని ఇళ్లను దొంగలు లక్ష్యం గా చేసుకున్నారు. వరుస చోరీల ఘటనలతో ప్రజలు భయభ్రాంతుల కు గురవుతున్నారు. ఇంటికితాళం వేసి బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. వరుస చోరీల ఘటనలే అందుకు నిదర్శనంగా మారుతున్నాయి. ఇటీవలే నంద్యాల పట్టణ శివారులోని క్రాంతినగర్‌లో టైలర్స్ అసోసియేషన్ నాయకుడు సుభాన్ ఇంట్లో భారీ చోరీ ఘటన మరువకముందే మంగళవారం తెల్లవారుజామున పట్టణ శివారులోని క్రాంతినగర్‌లో నేషనల్ హైవేకు పక్కనే ఉన్న నందిగ్రీన్ హోమ్స్ విల్లాలో వరుసగా నాలుగు ఇళ్లల్లో చోరీలకు పాల్పడి రూ.3 లక్షల నగదు, 12 తులాల బంగారు, అర కిలో వెండిని అపహరించుకుపోయారు. బెడ్‌రూమ్‌లో నిద్రిస్తుండగా వారు బయటకు రాకుండా తలుపులకు గొళ్లెం పెట్టి చోరీలకు పాల్పడ్డారు. మరో రెండు ఇళ్లల్లో చోరీకి విఫలయత్నం చేశారు. ఇంట్లో వారు గుర్తించి కేకలు వేయడంతో దొంగలు అక్కడినుంచి పరారయ్యారు. పట్టణ శివారు ప్రాంతంలో కట్టుదిట్టమైన సెక్యూరిటీ లేకపోవడం, సీసీకెమెరాల వ్యవస్థ పనిచేయకపో వడంతో దొంగలు ముందుగానే రెక్కీ నిర్వహించి చోరీలకు పాల్పడినట్లు తెలుస్తోంది. వరుస చోరీల ఘటనలతో దొంగలు పోలీసులకు సవాల్ విసురుతున్నారు. ఇదిలా ఉండగా చోరీలు జరిగిన ప్రాంతానికి పోలీసులు వెళ్లి పరిశీలించారు. క్లూస్‌టీం ఆధారాలను సేకరించింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


చిందరవందరగా వస్తువులు

ఎమ్మిగనూరులో పట్టపగలు చోరీ

- బంగారు నగలు ఎత్తుకెళ్లిన దొంగలు

టఎమ్మిగనూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయినగర్ ప్రాంతంలో మంగళవారం దొంగలు పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. సాయినగర్‌లో నివాసం ఉంటున్న అర్జున్ పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ ప్రాంతంలో ఇంజనీరింగ్ హార్డ్‌వేర్ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. మంగళవారం భార్య కర్నూలులో తమ బంధువుల ఇంట్లో జరిగిన దేవరకు వెళ్లడంతో అర్జున్ ఇంటికి తాళం వేసి దుకాణానికి వెళ్లాడు. దీన్ని అదునుగా తీసుకున్న దొంగలు ఇంటికి వేసిన తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న మూడున్నర తులాలు బంగారు నగలు ఎత్తుకెళ్లారు. మధ్యాహ్నం వచ్చిన అర్జున్ ఇంటి తాళాలు పగిలి పోయి ఉండటాన్ని గమనించి స్థానికుల సాయంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా పట్టపగలు దొంగతనానికి పాల్పడిన దొంగలు ఇంట్లో ఏడు తులాలు బంగారు, రూ. రెండు లక్షల నగదును ఎత్తుకెళ్లినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా అయ్యప్ప స్వామి గుడి ప్రాంతంలో న్యూ ఇందిరా నగర్‌లో సైతం టనాలుగైదు రోజుల క్రితం దొంగలు చోరీకి విఫలయత్నం చేసినట్లు స్థానికులు చర్చించుకున్నారు.

కేజీ చికెన్ రూ.300



- ఆత్మకూరులో కొండెక్కిన చికెన్ ధరలు..!
- బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్‌తో తగ్గిన ఉత్పత్తి
- స్కిన్‌లెస్ చికెన్ రూ.300 వరకు అమ్మకాలు
- ఆందోళనలో ప్రజలు

ఆత్మకూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరులో చికెన్ ధరలకు రెక్కలొచ్చాయి. వారం రోజుల క్రితం కిలో స్కిన్‌లెస్ చికెన్ ధరలు రూ.200 వరకు పలుకగా తాజాగా వాటి ధర రూ.300కు చేరుకోవడంతో కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఇటీవల రాష్ట్రంలో సంభవించిన బర్డ్‌ఫ్లూ కారణంగానే ఈ పరిస్థితులు నెలకొన్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. వాస్తవానికి ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆత్మకూరుతో సహా పలు ప్రాంతాలకు తెలంగాణ, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి బాయిలర్ కోళ్లను దిగుమతి చేసుకుంటారు. ఎప్పటికప్పుడు డిమాండ్‌కు తగ్గట్లుగా కోళ్ల ఉత్పత్తి కొనసాగడం వల్ల వాటి ధరలు నిలకడగా ఉండేవి. అయితే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఫిబ్రవరి నెలలో బర్డ్‌ఫ్లూ లక్షణాలు బయటపడటంతో అధికారులు సైతం అప్రమత్తమై ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా కోళ్ల ఫారాల్లో వ్యాధి బారిన పడిన కోళ్లతో మరిన్ని కోళ్లను కూడా ఖననం చేశారు. ఈ నేపథ్యంలో ఫారాలను నిలిపి వేసి బాయిలర్ గుడ్లు, కోళ్ల ఉత్పత్తిని నిలిపివేశారు.


చికెన్ కట్ చేస్తున్న వ్యాపారి

వారం క్రితం కిలో చికెన్ రూ.200.. నేడు రూ.300

ఆత్మకూరు ప్రాంతంలో వారం రోజుల క్రితం బాయిలర్ చికెన్ అమ్మకాలకు సంబంధించి లైవ్ కోడి రూ.120, స్కిన్‌తో కలిపి కిలో చికెన్ రూ.180, స్కిన్‌లెస్ కిలో చికెన్ రూ.200 చొప్పున విక్రయించారు. అయితే ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో డిమాండ్ అమాంతం పెరగడంతో రెండు రోజులుగా లైవ్‌కోడి రూ.190, స్కిన్‌తో కలిపి రూ.260, స్కిన్‌లెస్ చికెన్ రూ.280 చొప్పున విక్రయిస్తున్నారు. రిటైల్ దుకాణాల్లో స్కిన్‌లెస్ చికెన్ ధర రూ.300 వరకు విక్రయిస్తున్నారు. దీనికితోడు ఆత్మకూరులో కిలో మటన్ రూ.1000 వరకు ఉండటంతో జనం ఎక్కువగా చికెన్, చేపలను మాత్రమే కొనుగోలు చేస్తుండటంతో చికెన్ ధరలు అధికమయ్యాయి. కోళ్ల ఫారాలు తిరిగి ప్రారంభించి కోళ్ల ఉత్పత్తి పెరిగేంతవరకు చికెన్ ధరలు అధికంగానే ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు.

ఉత్పత్తి తగ్గడం వల్లే చికెన్ ధరల పెరుగుదల



రెండు క్రితం బర్డ్‌ఫ్లూ విజృంభించడంతో చాలాచోట్ల కోళ్లఫారాలను ముందస్తు జాగ్రత్తలతో నిలిపి వేశారు. దీంతో కోళ్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గుముఖం పట్టడంతో పాటు ప్రస్తుత రోజుల్లో చికెన్‌కు మరింత డిమాండ్ రావడంతో చికెన్ ధరలు పెరగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీనికితోడు గతంలో తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో ఎక్కువగా పౌల్ట్రీలు ఉండేవి. అయితే బర్డ్‌ఫ్లూ వల్ల తమిళనాడులో పౌల్ట్రీలు తగ్గిపోవడంతో కేవలం తెలంగాణ రాష్ట్రం నుంచే కోళ్లను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. రెండు, మూడు నెలల్లో కోళ్ల ఉత్పత్తి పెరిగినట్లయితే చికెన్ ధరలు తగ్గే అవకాశం ఉంది.

-రుహుల్లా, వలి చికెన్ సెంటర్ నిర్వాహకుడు, ఆత్మకూరు

సాగునీటిని వృథా చేయొద్దు

మహానంది, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చివరి ఆయకట్టు వరకు నీరు పారేందు కోసం వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి తెలుగుగంగ ప్రధాన కాల్వ ద్వారా నీటిని మూడు రోజుల పాటు విడుదల చేయడం జరిగిందని తెలుగుగంగ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చింతం క్రాంతి కుమార్ యాదవ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బుధవారం నుంచి 3 వతేదీ వరకు వచ్చే గంగ నీటిని విడుదల చేస్తామని, రైతులు నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహానంది మండలంలోని తెలుగుగంగ 13 వ బ్లాక్ సబ్ ఛానల్ ద్వారా నీటిని మళ్లించడం జరిగిందన్నారు. దీని ద్వారా గోపవరం, గంగవరం, మసీదుపురం, మొత్కలపల్లి, చెన్నూరు, ఇసుకపల్లె గ్రామాల రైతులు ఉపయోగించుకోవాలన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి


కొబ్బరి కాయల విక్రయకేంద్రాన్ని ప్రారంభిస్తున్న రామలింగారెడ్డి

మహానంది, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయానికి దర్శనం కోసం వచ్చే భక్తుల పట్ల టెండర్‌దారులు సత్ప్రవర్తనతో మెలగాలని కేసీ కెనాల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బన్నూరి రామలింగారెడ్డి తెలిపారు. మంగళవారం క్షేత్ర పరిధిలో ఏడాది పాటు భక్తులకు కొబ్బరి కాయలు, పూజా సామగ్రి విక్రయ కేంద్రంతో పాటు సామాన్లు భద్ర పరిచే గదిని ఆయన ప్రారంభించారు. ఆయయన మాట్లాడుతూ మహానందీశ్వరుడి దర్శనం కోసం వచ్చే భక్తులకు నాణ్యమైన వస్తువులను అందించడంతో పాటు వారి పట్ల దురుసుగా ప్రవర్తించకుండా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ యశస్విని, తెలుగుగంగ ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ క్రాంతికుమార్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి నరాల చంద్రమౌళీశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు గడ్డం నాగపుల్లయ్య కంచెర్ల శివ, గంగిశెట్టి మల్లిఖార్జున, సాయిలక్ష్మితో పాటు కాంట్రాక్టర్లు సతీష్ పాల్గొన్నారు.

టెక్కె సుంకులా పరమేశ్వరికి బోనాలు


బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నంద్యాల టెక్కెలో వెలసిన సుంకులాపరమేశ్వరీ దేవికి మంగళవారం చైత్ర మాసం సందర్భంగా బోనాలు భక్తులు సమర్పించారు. అమ్మవారికి ఉదయం క్షీరాభిషేకం, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. టెక్కె ఏరియాలోని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి సన్నిధికి చేరుకొని అమ్మవారికి కాయ,కర్పూరం, బోనాలు సమర్పించుకున్నారు.

గ్రామ కమిటీ ఎన్నిక

పాణ్యం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విశ్వహిందూపరిషత్ ఆలమూరు గ్రామ కమిటీని మంగళవారం మండల కార్యదర్శి కౌలూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగింది. వీహెచ్‌పీ గ్రామ అధ్యక్షుడిగా వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణుడు, కార్యదర్శిగా వెంకట్రామిరెడ్డి, భజరంగ్‌దళ్ యువ అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌ను ఎంపిక చేసినట్లు శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి సుధీర్, భజరంగ్ దళ్ అధ్యక్షుడు బాలకృష్ణ, వేణుకృష్ణ, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

లక్ష్యాలను సాధించండి : కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో చేపట్టే పనులపై దృష్టిసారించి లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని ఎన్‌ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఉపాధి హామీ పనుల లక్ష్య ప్రగతి సాధనపై అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. పశువులకు నీటితొట్ల నిర్మాణం, సేద్యపు నీటికుంటలు, పంటకాల్వలను పునరుద్ధరించడం, చెరువులు, కుంటలను సమగ్రంగా అభివృద్ధి పరచడం, ఉపాధి వేతనదారుని దినసరి వేతనాన్ని పెంచడం తదితర అంశాలపై ప్రత్యేకదృష్టి సారించాలని ఎంపీడీవో, ఏపీడీలను ఆదేశించారు.

- **సర్వేలను పూర్తి చేయండి** : గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా చేపట్టిన సర్వేలను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ రాజకుమారి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియోకాన్ఫరెన్స్‌హాల్‌నుంచి సచివాలయ సర్వీసులు, ఉపాధిహామీ, హౌసింగ్ అంశాలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌నిర్వహించి సమీక్షించారు.

మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

- ఎమ్మెల్యే గౌరు చరిత


కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

పాణ్యం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాలలలో రాణించాలని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. ఉగాది సందర్భంగా సుబ్బరాయుని కొత్తూరులో నిర్వహిస్తున్న జాతీయ మహిళా కబడ్డీ క్రీడలను ఆమె మంగళవారం ప్రారంభించారు. జాతీయ క్రీడాకారుడు, రైల్వే ఎస్‌ఐ నాగగోపేశ్వరరావు సతీమణి కీర్తిశేషులు చింతల లక్ష్మీదేవి జ్ఞాపకార్థం, మానవత స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా ఈ క్రీడలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నందికొట్కూరు టీడీపీ ఇంచార్జి గౌరు వెంకటరెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ ఈఓ రామకృష్ణ, సుబ్బారెడ్డి, ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, ఈఓఆర్‌డీ చంద్రమౌళీశ్వరగౌడ్, టీడీపీ కన్వీనర్ గణపం జయరామిరెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు : ఎమ్మెల్యే గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి దంపతులకు మంగళవారం కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో రామకృష్ణ ఎమ్మెల్యే దంపతులకు ఘనంగా స్వాగతం పలికి అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధిపై ఈఓతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యేగౌరు చరిత సుబ్బరాయుని కొత్తూరు గ్రామంలో పింఛన్‌లు పంపిణీ చేశారు.

రూ. 21. 50 కోట్లతో రహదారుల అభివృద్ధి

పాణ్యం నియోజకవర్గంలోని రహదారులను రూ. 21.50 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పేర్కొన్నారు. మంగళవారం ఆమె పాణ్యం టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ పాణ్యం మండలంలోని పాణ్యం బనగానపల్లె రహదారి 13 కిలోమీటర్లకు సీఆర్ఎఫ్ నిధులు రూ. 2. 50 కోట్లు, నందివర్గం నుంచి కొత్తూరు 5 కిలోమీటర్లకు రూ. 2. 50 కోట్లు, పాణ్యం డొంగు నుంచి దుర్వేశి రోడ్డు వరకు 13 కిలోమీటర్లకు రూ. 5. 5. కోట్లతో బీటీ రోడ్డు, కర్నూలు ఓల్డ్‌సిటీ నుంచి సఫా కళాశాల వరకు 6 కిలోమీటర్లకు రూ. 3. 50 కోట్లు, ఓర్వకల్లు మండలంలోని తిప్పాయిపల్లె, శకునాల, బ్రాహ్మణపల్లె గ్రామాలకు 10 కిలోమీటర్లకు రూ. 3 కోట్లు నాబార్డు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పంచాయతీ రాజ్ నాబార్డు నిధులతో నన్నూరు రహదారికి రూ. 40 లక్షలు, గడివేముల నుంచి కొర్రపోలూరు వరకు 8 కిలోమీటర్లకు రూ. 2. 60 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పాణ్యం డొంగు రహదారి ఇప్పటికే ప్రారంభమైనట్లు తెలిపారు. తమ్మరాజుపల్లె ఏటిపాయ చెక్‌డ్యాంకు రూ. 3. 50 కోట్లు మంజూరయ్యాయన్నారు.

నెలాఖరు వరకు ఎస్సార్బీసీకి నీరు : ఎస్సార్బీసీ కింద సాగయ్యే పంటలకు ఈనెల చివరి వరకు ఎస్సార్బీసీ నీరు అందేలా జలవనరుల శాఖ అధికారులతో చర్చించామన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మండలంలో వరి పంటలు కంకి దశలో ఉన్నాయన్నారు. మంగళవారం ఎస్సార్బీసీ కాల్వకు నీటి సరఫరా నిలిపివేయడంతో పంటలు ఎండిపోయే ప్రమదముండడంతో రైతుల వినతి మేరకు నీటిని వదలాలని అధికారులను కోరినట్లు తెలిపారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని కోరారు.

అర్హులందరికీ పింఛన్లు: ఎమ్మెల్యే


నీటి తొట్టికి భూమి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ పింఛన్లు అందజేయాలని అధికారులకు ఎమ్మెల్యే జయసూర్య సూచించారు. మంగళవారం మండలంలోని వడ్డెమాను గ్రామంలో ఉదయాన్నే ఎమ్మెల్యే జనసూర్య సామాజిక పింఛన్లను ఇంటివద్దకే వెళ్లి అర్హులైన వారికి పంపిణీచేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని ఇబ్బందులున్నా కూటమి ప్రభుత్వం పింఛన్లను ఒకటో తేదీనే పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథరెడ్డి, సత్యంరెడ్డి, విజయుడు, వెంకటరాముడు, రాఘవరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

భూమిపూజ: వడ్డెమాను గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు నీటితొట్ల నిర్మాణానికి ఎమ్మెల్యే జయసూర్య భూమి పూజ నిర్వహించారు. ఈ ఆయన మాట్లాడుతూ ఒక్కొక్క నీటితొట్టికోసం ప్రభుత్వం రూ. 33 వేలు కేటాయించిందన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు 45 నీటి తొట్లను మంజూరు చేశామన్నారు.

పింఛన్ల పంపిణీలో అలసత్వం వద్దు

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పథకం కింద అర్హులైన లబ్ధిదారులందరికీ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో సచివాలయ సిబ్బంది అలసత్వం వహించకూడదని రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి అధికారి నివాస్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ రాజకుమారితో కలిసి నంద్యాలలోని 34వ వార్డు వీసీ కాలనీలో సామాజిక భద్రతాపింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా 1వ తేది ఉదయమే పింఛన్ల పంపిణీ చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. పింఛన్ల పంపిణీకి సంబంధించి సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ లబ్ధిదారులకు సకాలంలో అందజేయాలన్నారు. లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. అనంతరం మండలంలోని రాయమాల్పురం గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని ఎస్టీ కాలనీలో పింఛన్లను అందజేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద పశువుల తాగునీటి తొట్ల నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. గ్రామంలోని సచివాలయాన్ని తనిఖీ చేశారు. ప్రజలకు ఏయేసేవలను అందిస్తున్నారన్న అంశాలంపై సిబ్బందితో తెలుసుకున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో వాట్సాప్‌ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, డీఆర్డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య, 34వ వార్డు కౌన్సిలర్, టీడీపీ ఫ్లోర్‌లీడర్ మాబువలి, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

మిడుతూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాసపేట మజారా గ్రామమైన ఉప్పలదడియ గ్రామంలో 5న రాష్ట్ర స్థాయి ఆరు పండ్ల ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం నాయకుడు జయరామి రెడ్డి తెలిపారు. పోటీల్లో పాల్గొనే ఎడ్ల యజమానులు రూ.600 ఎంట్రి ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో గెలుపొందిన ఎడ్లకు మొదటి బహుమతి రూ.40 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.25 వేలు, నాలుగో బహుమతి రూ. 20 వేలు, 5వ బహుమతి రూ. 15 వేలు, 6వ బహుమతి రూ. 10 వేలు, ఏడో బహుమతిరూ 8 వేలు, 8వ బహుమతి రూ. 5 వేలు బహుమతి అందజేస్తామని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఏఎస్పీ



నంద్యాల క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సబ్ డివిజన్‌లోని ప్రజలు దొంగతనాలు, చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ మంద జావలి అల్ఫోన్స్ సూచించారు. మంగళవారం నంద్యాలలోని డీఎస్పీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సినవారు బయటకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. ఇంట్లో సీసీకెమెరాలను అమర్చుకొని వాటి పర్యవేక్షణ మొబైల్ ఫోన్లను అనుసంధానం చేసుకోవడం ద్వారా ఎప్పటికప్పుడు మన ఇంటిపై మనకు నిఘా ఉంటుందని, ఎవరైనా కొత్తవ్యక్తులు ఇంట్లోకి చొరబడగానే సీసీకెమెరా ద్వారా మన మొబైల్‌కు సెన్సార్ రావడంతో వెంటనే అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందిస్తే దొంగలను పట్టుకునేందుకు వీలవుతుందని తెలిపారు. పట్టణశివారులోని అపార్ట్‌మెంట్లు, విల్లాస్‌కు సంబంధించి సెక్యూరిటీ అప్రమత్తంగా రాత్రిపూట గస్తీకాసేవిధంగా ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు.

కొత్త పింఛన్లు మంజూరు చేయాలి

నందికొట్కూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కొత్త పింఛన్లు మంజూరు చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలలు దాటిపోతున్న కొత్తగా ఒక్క పెన్షన్ కూడా మంజూరు చేయలేదన్నారు. ఏప్రిల్ నెలలో కొత్త పింఛన్లు ఇస్తామని ముఖ్యమంత్రి క్యాబినెట్‌లో తీర్మానం చేసి ప్రకటించినా ఇంత వరకు పెన్షన్‌లు మంజూరు కాలేదన్నారు. కొత్త పెన్షన్లు, కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయకపోతే మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో లిబరేషన్ జిల్లా నాయకులు రామకృష్ణ, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

శక్తియాప్‌పై మహిళలకు అవగాహన


శక్తియాప్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నంద్యాల క్రైం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నంద్యాల తాలుకా ఎస్సై ధనమ్మ ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలోని గురురాజా బ్యాంక్ కోచింగ్ సెంటర్‌లో మంగళవారం మహిళలకు శక్తియాప్‌పై అవగాహన కల్పించారు. మహిళలపై జరిగే నేరాల కట్టడి, శక్తియాప్ వల్ల కలిగే ప్రయోజనాల గురించి, సైబర్‌క్రైం, 100, 112టోల్‌ఫ్రీ నంబర్ల గురించి, ఈవ్‌టీజింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలపై జరిగే నేరాలనుండి ఎలా రక్షించుకోవాలనే అంశాలను విద్యార్థినులకు వివరించి ప్రతి మహిళ శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

అలివి వలలతో చేపలు పడితే చర్యలు


సంగమేశ్వరం వద్ద మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న వీఆర్వో వేణుగోపాల్ గౌడు

కొత్తపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు అలివి వలలతో చేపలు పడితే చర్యలు తప్పవని ఎర్రమటం గ్రామ రెవెన్యూ అధికారి వేణుగోపాల్ గౌడు హెచ్చరించారు. మంగళవారం కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరం వద్ద తహసీల్దార్ ఉమారాణి ఆదేశాల మేరకు వీఆర్వో వేణుగోపాల్ కృష్ణానదిలో చేపలు పట్టే మత్స్యకారులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం జీవనో అభివృద్ధి కోసం ప్రతి ఏటా రూ.లక్షలు వెచ్చించి 10 లక్షలకు పైగా చేపపిల్లలు విడుదల చేస్తున్నారని చెప్పారు. అయితే కొందరు మత్స్యకారులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం అలివి వలలు ఉపయోగించి కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో చేపలు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారిని క్షేత్ర స్థాయిలో గుర్తించి వారి లైసెన్సును రద్దు చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చేప పిల్లలు బాగా ఎదిగిన తర్వాతనే చేపలు పట్టుకుని జీవనం సాగించాలని వీఆర్వో సూచించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

నందికొట్కూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు రామిరెడ్డి, కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ అర్షద్ మాట్లాడుతూ ఎండలు అధికమవుతున్న నేపథ్యంలో వృత్తిరీత్యా రోజువారి పనుల కోసం బయటకు వచ్చే ప్రజలను దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో జనసేన చలివేంద్రం ఏర్పాటుకు కర్నూలు నియోజకవర్గం ఇన్‌చార్జి షేక్ అర్షద్, జనసేన నాయకులు బాలరాజు, సతీష్, రామిరెడ్డి, రాము, మధు, పుష్పరాజ్, నాగరాజు, రహమాన్, రమణ, క్రాంతి, నాయుడు, కీర్తి రమణ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు శిక్షణా తరగతులు

సున్నిపెంట,ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): సున్నిపెంటలోని శ్రీశైల మాత పాఠశాలలో మంగళవారం అంగన్‌వాడీల శిక్షణ తరగతులు జరిగాయి. ప్రధాన మంత్రి ప్రవేశ పెట్టిన' పోషన్‌బి- పడాయిబీ, చేతన కార్యక్రమంలో భాగంగా ఈ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఇందులో 0 నుంచి 3 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన పిల్లల పోషణ, 3 సంవత్సరాల నుండి 6 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లల సంరక్షణకు తల్లులు తీసుకోవాల్సిన జాగ్రతల గురించి అవగాహన కల్పించాని అంగన్‌వాడీలకు శిక్షణ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పి.అంజలిదేవి, వి.కోమల పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన మూల పెద్దమ్మ ఆలయం


క్యూలైన్‌లో భక్తులు

గడివేముల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మూలపెద్దమ్మ ఆలయంలో అమ్మవారి జాతర పురస్కరించుకొని మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ప్రకాశం, కర్నూలు, నంద్యాల, మహబూబ్‌నగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజలు చేశారు. బియ్యం, బ్యాళ్లు, సారెలను సమర్పించారు. భారీ సంఖ్యలో భక్తులు రావడంతో క్యూలైన్‌లో కిటకిటలాడాయి. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా, అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, గడివేముల ఎస్‌ఐ నాగార్జున్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

సున్నిపెంటలో సర్వే ప్రారంభం


సున్నిపెంట గ్రామంలో ప్రభుత్వ భూములను సర్వే చేస్తున్న ఆర్డీవో

సున్నిపెంట, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): సున్నిపెంట గ్రామంలో ప్రభుత్వ భూముల సర్వే మంగళవారం ఆర్డీవో నాగజ్యోతి ఆధ్వర్యంలో ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ సర్వేను సున్నిపెంటలో ప్రభుత్వ స్థలం ఎంత ఉందని, ఇందులో దేవస్థానానికి కేటాయించిన స్థలం ఎంత అనే వివరాలు తెలుస్తాయని దేవస్థానం ఈఈ నరసింహారెడ్డి తెలిపారు. గత ప్రభుత్వంలో పంచాయతీ రాజ్ శాఖకు కేటాయించిన 208.70 ఎకరాలు తిరిగి ప్రభుత్వ స్వాధీనం చేసుకుని అందులో పర్యాటక శాఖ అభివృద్ధికి, ప్రభుత్వ చేపట్టబోయే వివిధ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈ సర్వే కార్యక్రమం చేపట్టినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం నీటిపారుదల శాఖ అధికారు లు, అటవీశాఖ అధికారులు సర్వేలో పాల్గొంటారని తహసీల్దార్ తెలిపారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

కొత్తపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినం సందర్భంగా మండలంలోని కొక్కెరంచ గ్రామంలో చెన్నకేశవ స్వామి ఆలయం తరుపున మంగళవారం నిర్వహించి అంతరాష్ట్ర ఎద్దుల బండలాగుడ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీలను కొక్కెరంచ గ్రామ సర్పంచ్ విష్ణువర్దన్ రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలో చెలిమిల్ల గ్రామానికి చెందిన చిన్న చెన్నయ్య ఎద్దులు మొదటి విజేతగా నిలిచి రూ.20వేలు నగదును కైవసం చేసుకున్నాయి. రెండో విజేతగా మిడుతూరు రోళ్లపాడు గ్రామానికి చెందిన డాపిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎద్దులు నిలిచి రూ.15వేలు నగదును గెలుచుకున్నాయి. మూడో విజేతగా ఓర్వకల్లు మండలం బాపనపల్లి గ్రామానికి చెందిన మౌలాలి వృషభాలు రూ.10వేలు నగదును కైవసం చేసుకున్నాయి. కార్యక్రమంలో జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి, సుదాకర్ రెడ్డి, రవీంద్రరెడ్డి, జయరాం పాల్గొన్నారు.

వైభవంగా బోనాల పండుగ



చాగలమర్రిలో బోనాలతో వెళ్తున్న మహిళలు

చాగలమర్రి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో వైభవంగా బోనాల పండుగను మంగళవారం నిర్వహించారు. మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకొని గ్రామోత్సవం చేశారు. బోనాలను పెద్దమ్మకు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, బీసీ సంఘం గౌరవ అధ్యక్షుడు రామతీర్థం, టీడీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మండలంలోని మీర్జాపురం సుంకులమ్మ, కొలిమిగుండ్ల కుంటెమ్మ, కనకాద్రిపల్లె అంకాళమ్మ, చౌడమ్మ, గొర్వి మానుపల్లె పెద్దమ్మ తల్లి, బెలుం, బెలుం శింగవరం, అంకిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు, విశేష పూజలు చేశారు. గ్రామ దేవతలకు సా మూహిక బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ బిల్లు రీడర్లు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ భద్రత కల్పించి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని విద్యుత్ బిల్లు రీడర్లు డిమాండ్ చేశారు. మంగళవారం ఆళ్లగడ్డ పట్టణంలో విద్యుత్ బిల్లుల రీడర్ల సమావేశం నిర్వహించారు. విద్యుత్ సంస్కరణలు వేగవం తమవుతున్న తరుణంలో ఇంటింటికి స్మార్ట్ మీటర్లను అమర్చే విధానం ప్రారంభమైందన్నారు. ప్రీపెయిడ్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించే విధానం అమలులోకి వస్తే మీటర్ రీడర్స్ భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందన్నారు. అనంతరం తమ డిమాండ్లను పరిష్కరించాలని నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి తాళ్ల శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి రమేష్, రైతు సంఘం జిల్లా నాయకుడు రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బీరప్ప మల్లికార్జున స్వామి ఉత్సవాలు

బేతంచెర్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలపాలపల్లి గ్రామంలో వెలసిన బీరప్ప మల్లికార్జున స్వామి ఉగాది పండుగ సందర్భంగా సోమవారం రాత్రి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా ఉత్సవాలు నిర్వహించారు. బీరప్ప, బీరపద్రోళ్ల వాయిద్యాల మధ్య ఊరేగింపు నిర్వహించారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ రమేష్‌బాబు గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పోలూరు శ్రీనివాసరెడ్డి, పోలూరు రాఘవరెడ్డి, ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులను అరికట్టాలి



కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న క్రైస్తవులు

బేతంచెర్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులపై, చర్చిలపై దాడులను అరికట్టి పాస్టర్ పగడాల ప్రవీణ్ మరణానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని బేతంచెర్ల మండలం క్రైస్తవ పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డీవీఎన్ ప్రసాద్, దాసన్న ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సాయంత్రం బేతంచెర్ల-డోన్ రోడ్డులో గల షాలేం ప్రార్థన మందిరం నుంచి శాంతియుత కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కొత్తబస్టాండు ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు కే.కుమార్, సామేల్, మార్కు, కిరణ్, గుటిపల్లి రాజశేఖర్, సురేష్ జాన్ పీటర్, శాంతిరాజ్, మల్లేష్, శేఖర్ ఉన్నారు.

కేంద్రీయ విద్యాలయం అడ్మిషన్లు ప్రారంభించాలి

● కాంగ్రెస్ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి

డోన్ రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలో కేంద్రీయ విద్యాలయంలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించాలని కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ పట్టణంలో తాత్కాలికంగా కేటాయించిన ఐటీఐ నూతన భవనంలో తరగతులు నిర్వహించి విద్యా సంవత్సరం నష్టపోకుండా చూడాలని కోరారు. ఏప్రిల్ 1వ తేదీన ప్రారంభం అవుతుందన్న కేంద్రీయ విద్యాలయం అడ్మిషన్ల ప్రక్రియ ఇంత వరకు ప్రారంభం కాకపోవడం బాధాకరమన్నారు. కనీసం 1 నుంచి 5వ తరగతి వరకు అడ్మిషన్లు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పేదలకు పెళ్లి కానుక కిట్లు పంపిణీ



పెళ్లి కానుక కిట్లు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : బనగానపల్లె పట్టణంలోని బీసీ రాజారెడ్డి కార్యాలయం లో పెళ్లి కానుక కిట్లు బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. పట్టణంలోని కొండపేటకు చెందిన మహబూబ్‌హుసేన్, అవుకు మండలానికి చెందిన ఓ కుటుంబానికి పెళ్లి కానుక కిట్లు బీసీ రాజారెడ్డి అందించారు. బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె ని యోజకవర్గంలో వధువుకు సంబంధించి ఎవరైనా పేదవారు ఉంటే వారికి పెళ్లికానుక కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

జయప్రదం చేయాలి: ఏపీటీఎఫ్

బనగానపల్లె, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ ఎదుట ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆర్థిక పరమైన డిమాండ్ల సాధనకు తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్ సంఘం నాయకులు మధుసూదన్‌రావు, మాధవస్వామి, సత్యప్రకాశ్, శ్రీనివాసరెడ్డి కోరారు. మంగళవారం బనగానపల్లె ఏపీటీఎఫ్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఫ్యాప్టో పిలుపు మేరకు బుధవారం నిరసన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. పాతపెన్షన్ విధానం అమలు చేయాలని, బకాయిపడ్డ మూడు డీఏలను చెల్లించాలని, పీఆర్సీ కమీషన్ నియమించాలనే తదితర డిమాండ్లతో నిరసన చేపట్టనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వెంకటకృష్ణుడు, ప్రతాప్, పోలియానాయక్, మల్లికార్జున , శేఖర్, రామస్వామి, రామకృష్ణ, గోవిందనాయక్ తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్యా.. పదైపోయింది..!

● ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు ● మళ్లీ కలుద్దామంటూ వీడ్కోలు

చాగలమర్రి/రుద్రవరం/కొలిమిగుండ్ల/డోన్ టౌన్/దొర్నిపాడు/ ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లు పుస్తకాలతో కుస్తీ పట్టారు.. పరీక్షల కోసం గంటల తరబడి చదివారు. రాత్రింబవళ్లు నిద్రమేలుకొని కష్టించారు.. శ్రద్ధతో పరీక్ష రాశారు. మంగళవారం పది పరీక్షలు పూర్తి కావడంతో విద్యార్థులంతా ఖుషి అయ్యారు. హమ్మయ్యా ఓ పనైపోయిందని గంతులు వేసుకుంటూ పరీక్షా కేంద్రాల నుంచి బయటికి వచ్చారు. హాస్టళ్ల విద్యార్థులు స్వగ్రామాలకు బయలు దేరారు. కస్తూర్బా పాఠశాలలో చదివే బాలికలు ట్రంకు పెట్టేలు, బ్యాగులు చేతపట్టి మళ్లీ కలుద్దామంటూ స్నేహితులకు బైబై చెబుతూ తమ స్వగ్రామాలకు తల్లిదండ్రులతో ద్విచక్రవాహనాలపై వెళ్లిపోయారు. మరి కొందరు బస్సులలో తమ ఊరికి ప్రయాణించారు.



రుద్రవరంలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



చాగలమర్రిలో పరీక్ష రాసి బయటికి వచ్చిన విద్యార్థినులు



కొలిమిగుండ్లలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



పరీక్షలు పూర్తికావడంతో తల్లిదండ్రులతో ద్విచక్రవాహనాలపై వెళ్తున్న బాలికలు



కస్తూర్బా నుంచి ఇంటికి వెళ్తున్న బాలికలు



ఇంటికి వెళ్లేందుకు సిద్ధమైన విద్యార్థినులు



రుద్రవరంలో..



చాగలమర్రిలో విజయకేతనం చూపుతున్న బాలికలు

పరిసరాల శుభ్రత ఏది?

● పంచాయతీ అధికారులపై మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆగ్రహం



అమడాల గ్రామంలో మురుగును పరిశీలిస్తున్న మంత్రి బీసీ

కోవెలకుంట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల శుభ్రత ఏది అని పంచాయతీ అధికారులపై మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం అమడాల గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా డ్రైనేజీలో చెత్త పేరుకుపోయి అపరిశుభ్రంగా ఉండడంతో పంచాయతీ అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీలో చెత్తాచెదారం పేరుకుపోయి రహదారులు బురదమయంగా మారిన కనిపించడం లేదా అని నిలదీశారు.. నెలనెలా ఠంచనుగా జీతాలు తీసుకుంటూ పనులు చేయకపోతే ఎలా అని పంచాయతీ సెక్రటరీ సుబ్బారెడ్డి, ఈవోఆర్‌డి ప్రకాశ్‌నాయుడును ప్రశ్నించారు. పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. అంతేకాక గ్రామంలో సచివాలయ సిబ్బంది పింఛన్లు రానివారి డేటాను సేకరించాలన్నారు. కార్యక్రమంలో బనగానపల్లె నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులుశ్రీనిధి హోటల్ మద్దిలేటి, కోవెలకుంట్ల మండల టీడీపీ అధ్యక్షులు అమడాల మద్దిలేటి, టీడీపీ యువ నాయకులు కె.మల్లిఖార్జునరెడ్డి, పొట్టిపాటి సుబ్బారెడ్డి, కలుగొట్ల అర్జున్‌రెడ్డి, సౌదరదిన్నె సుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో వర ప్రసాదరావు, తహసీల్దారు పవన్ కుమార్‌రెడ్డి, ఎంఈవో వెంకటసుబ్బయ్య, బిజినవేముల హుసేనయ్య, చిన్నకొప్పెర్ల బుచ్చన్న, సీఐ హనుమంతనాయక్, అన్నిశాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

టీడీపీ పేదల ప్రభుత్వం

● డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్ రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఇది పేదల ప్రభుత్వమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఉడుములపాడు గ్రామంలో ఎమ్మెల్యే కోట్ల వృద్ధులకు, దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, ఉడుముల పాడు సర్పంచ్ రాధమ్మ, గ్రామ నాయకులు రామాంజనేయులు పాల్గొన్నారు.



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

బనగానపల్లె, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాల్లో ప్రముఖ శక్తి క్షేత్రమైన నందవరం చౌడేశ్వరిదేవి ఉగాది బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం అమ్మవారి రాయబారాది మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ జి.కామేశ్వరమ్మ, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం చౌడేశ్వరిదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సాయంత్రంలో గ్రామంలోని ఊరివాకిలి వద్ద ప్రత్యేకంగా అలంకరించి తేరుబండికి గ్రామంలోని రైతుల ఎద్దులను కట్టి గ్రామ శివార్లలో ఉన్న పొలిమేర వద్దకు అమ్మవారి రాయబారాది మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి గ్రామంలోకి తిరిగి రావడంతో రాయబారాది మహోత్సవం ముగిసింది. రాత్రి పౌరాణిక నాటక ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు.



ఎద్దులతో తేరును లాగిస్తున్న గ్రామస్థులు



వడిబియ్యం తీసుకువస్తున్న బీసీ ఇందిరమ్మ

చౌడేశ్వరీమాతకు వడిబియ్యం, చీరె సమర్పణ

మండలంలోని ప్రముఖ శక్తిక్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత బ్రహ్మోత్సవాల సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ మంగళవారం అమ్మవారికి వడిబియ్యం, చీరె సమర్పించారు. బీసీ ఇందిరమ్మకు ఆలయ పూజారులు, ఆలయ మాజీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి తదితరులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా బీసీ ఇందిరమ్మ అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు అమ్మవారికి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు వెంగన్న పెద్దఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హోరాహోరీగా సాగిన బండలాడుగు పోటీలు

బేతంచెర్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సుంకులా పరమేశ్వరి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో ఐదు జతల వృషభాలు పాల్గొన్నాయి. ప్రథమ విజేతగా గద్వాల మండలం ఇటిక్యాలపల్లెకు చెందిన బరక సంజీవ రామస్వామి, సాయి వర్ధన్ వంశీకృష్ణ ఎద్దులు ప్రథమ విజేతగా నిలిచాయి. ద్వితీయ బహుమతి నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామానికి చెందిన శేఖర్ ఎద్దులు, తృతీయ బహుమతి బేతంచెర్ల గ్రామానికి చెందిన మేకల భానుజా ఎద్దులు, నాలుగో బహుమతి బేతంచెర్ల మండలం అంబాపురం గ్రామానికి చెందిన కురువ వెంకట్రాముడు ఎద్దులు నిలిచాయి. దేవస్థానం కమిటీ సభ్యులు రైతు సంఘం నాయకులు బహుమతులు ప్రదానం చేశారు.

సంజామల: కానాల సుంకులమ్మ అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకొని రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో కడప జిల్లా దువ్వూరు మండలం దాసరిపల్లెకు చెందిన అశోక్ ఎద్దులు మొదటి విజేతగా నిలిచాయి. ద్వితీయ స్థానంలో ప్రొద్దుటూరు మండలం అయోధ్యనగర్ డీసీఎస్సార్ బుల్స్, మూడవ స్థానంలో సంజామల మండలం ముక్కమల్ల గ్రామానికి చెందిన మూసాని చంద్రశేఖర్‌రెడ్డి ఎద్దులు, నాలుగవ స్థానంలో దువ్వూరు మండలం దాసరిపల్లె గ్రామానికి చెందిన రాజానాయుడు, కంబైన్డ్ నంద్యాల జిల్లా దొర్నిపాడు మండలం దొర్నిపాడు గ్రామానికి చెందిన బత్తుల క్రిష్ణయ్యయాదవ్ ఎద్దులు, ఐదవ స్థానంలో సంజామల మండలం, కానాల గ్రామానికి చెందిన గుండం చెన్నారెడ్డి ఎద్దులు, ఆరో స్థానంలో బనగానపల్లె మండల రామక్రిష్ణాపురం గ్రామ సర్పంచ్ నాగేంద్ర ఎద్దులు, ఏడో స్థానంలో నంద్యాల జిల్లా గోస్పాడు మండల ఒంటెలగల గ్రామానికి చెందిన ప్రమీలప్రకాశం ఎద్దులు, ఎనిమిది, తొమ్మిది, పదిస్థానాల్లో ఆయా గ్రామాల ఎద్దులు విజేతగా నిలిచాయి. ఆయా ఎద్దుల యజమానులకు రూ. 30 వేలు, రూ. 25 వేలు, రూ. 20 వేలు, రూ. 15 వేలు, రూ. 10 వేలు, రూ. 8 వేలు, రూ. 5 వేలు, రూ. 3 వేలు, రూ. 2 వేలు నగదు అందజేశారు.



రంగాపురంలో రాతిదూలాన్ని లాగుతున్న ఎద్దులు

రుద్రవరం: మండలంలోని శ్రీరంగాపురం మంగళవారం పోటాపోటీగా ఎద్దుల బండలాగుడు పోటీలు కొనసాగాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఎద్దుల యజమా నులు తరలివచ్చారు. గెలుపొందిన విజేతలకు రూ.50వేలు, రూ.40 వేలు, రూ. 30వేలు, రూ.20వేలు, రూ. 10వేలు ప్రదానం చేశారు.

7న రాష్ట్రస్థాయి రాతిదూలం పోటీలు

చాగలమర్రి: శ్రీరామనవమి సందర్భం గా కొలుములపేట గ్రామంలో సీతారాముల కల్యాణం, గ్రామోత్స వం, 7న రాష్ట్రస్థాయి రాతిదూలం పోటీలు నిర్వహించనున్నట్లు గ్రా మ పెద్దలు తెలిపారు. పోటీల్లో విజేతలైన వృష భరాజముల యజ మానులకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.7 వేలు, రూ.6 వేలు నగదును దాతలు అందజేస్తారన్నారు. నవమి ఉత్సవాలను జయప్ర దం చేయాలని కోరారు.

న్యాయవాదులకు సత్కారం



న్యాయవాదులను అభినందిస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్ రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): డోన్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్, కోశాధికారిగా మంగమూరి శ్రీనివాసులు ఎన్నికయ్యారు. మంగళవారం ఎంఎస్ఆర్ కార్యాల యంలో వారిని రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు మన్నె చిన్న నాగిరెడ్డి, కల్ల మహేష్ రెడ్డి, మధు సూదన్ గౌడు, టీఈ నాగరాజు గౌడు, మదన్‌గోపాల్, విజయకుమార్, కవీశ్వర్ పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి దేవర

డోన్ రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరబండ గ్రామంలో పెద్దమ్మ తల్లి దేవర మహోత్సవాలు మంగళ వారం ఘనంగా జరిగాయి. టీడీపీ నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, డోన్ నాయకుడు మన్నె గౌతమ్ రెడ్డి పెద్దమ్మ తల్లి దేవరలో పాల్గొని పూజలు చేశారు. గ్రామంలో శ్రీను, సుధాకర్, వెంకట్రాముడు తదితరుల ఆహ్వానం మేరకు ఇళ్లకు వెళ్లారు.

ఆప్కాస్ రద్దును ఉపసంహరించుకోవాలి

డోన్ టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ రద్దు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి టి.శివరాం, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పెద్ద ఎల్లయ్య, కుల్లాయప్ప కోరారు. మంగళవారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి ధర్నా చేశారు. కార్యక్రమంలో దేవదానం, గోవిందు, ఏసు, ఆవులయ్య, చాపల రామాంజి, సిద్దప్ప, చంద్ర, సురేష్, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

ఇంటర్ తరగతులు ప్రారంభం

రుద్రవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తెలిపారు. ఇంటర్ బోర్డు అధికారికంగా ఏప్రిల్ 1నుంచి తరగతులు ప్రారంభించాలని ఆదేశించడంతో తరగతులు ప్రారంభించామన్నారు. తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ కళాశాలల్లో ప్రైవేట్‌కుదీటుగా విద్యాబోధన నిర్వహిస్తున్నామన్నారు.

కొత్త బేస్ క్యాంపు ఏర్పాటుకు చర్యలు

రుద్రవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం సబ్ డివిజనులోని చెలిమ రేంజ్‌లో కొత్త బేస్ క్యాంపు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సెక్షన్ ఆఫీసరు కిశోర్‌కుమార్ మంగళవారం తెలిపారు. పెద్దకంబలూరు సెక్షన్ పరిధిలో బేస్‌క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అటవీ ప్రాంతంలో నేర నియంత్రణకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేందుకు బేస్‌క్యాంపు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పింఛన్ల పరిశీలనకు సహకరించాలి

చాగలమర్రి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గ్రామాల్లో దివ్యాంగ పింఛన్ల పరిశీలన ఈనెల 16 నుంచి నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగనున్నట్లు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ మంగళవారం తెలిపారు. బుద్ధిమాద్యం, చెవిటి, మూగ, అంధ, శారీరక వైకల్యం పింఛన్లు పొందే లబ్ధిదారులు తమ ధృవీకరణ పత్రాలను వైద్యులు పరిశీలించనున్నట్లు తెలిపారు. మండలంలో 732 మందికి ఆయా గ్రామ సచివాలయాల ద్వారా నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో 99 శాతం పింఛన్లు పంపిణీ చేశామన్నారు.

బోర్డుపై బుగ్గన శేషారెడ్డి పేరు చెరిపివేత

- భగ్గుమంటున్న వైసీపీ శ్రేణులు



ప్యాపిలి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి బోర్డుపై ది వంగత మాజీ ఎమ్మెల్యే బుగ్గన శేషారెడ్డి పేరు చెరివేతపై వైసీపీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. పట్టణంలోని ప్రభుత్వ విశ్రాంతి భవ నం సమీపంలో మాజీ ఎమ్మెల్యే దివంగత బుగ్గన శేషారెడ్డి పేరుమీ ద స్కిల్ డెవలప్‌మెంటు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేంద్రానికి సంబంధించిన బోర్డును ఆర్అండ్‌బీ రహదారి ప్రక్కన ఏర్పాటు చేశారు. అయితే ఈ బోర్డుపై ఉన్న బుగ్గన శేషారెడ్డి పేరును గుర్తు తెలియని వ్యక్తులు పెయింటింగ్‌తో చెరిపివేశారు. దీనిని గమనించిన వైసీపీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఘనటపై విచారణ చేసి కారుకులైన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను వైసీపీ నాయకులు కోరారు.